
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

మంగళవారం 2 డిసెంబరు 2025

రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఇంటిలో భారీ చోరీ

చిలకలూరిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గాంధీపేటలో నివాసముంటున్న డీఆర్ఎస్ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ సుజాత ఇంట్లో దొంగతనం జరిగింది. దొంగలు ఇంటిలోని 20 సవర్ల బంగారు ఆభరణాలు, లక్ష రూపాయల నగదు అపహరించారు. సుజాత తన తల్లి వైద్య చికిత్సల నిమిత్తం కొన్ని రోజులుగా హైదరాబాదులో ఉంటున్నారు. పనిమనిషి ఆదివారం ఆవరణలో శుభ్రం చేసేందుకు వెళ్లగా.. తలుపులు తీసి ఉండడాన్ని గుర్తించారు. యజమానికి సమాచారం ఇవ్వ డంతో.. చిలకలూరిపేటకు సోమవారం వచ్చిన సుజాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఇంటిలోని వెండి వస్తువుల జోలికి మాత్రం దొంగలు వెళ్ల లేదు. పోలీసులు క్లూస్ టీంను రప్పించి వేలి ముద్రలు సేకరించారు. చిలకలూరిపేట అర్బన్ సీఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



8

5న మెగా పీటీఎం 3.0

- అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో నిర్వహణ
- తల్లిదండ్రులతో పిల్లల ప్రగతిపై చర్చ
- అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనం

పీఎంఏవై గడువు పొడిగింపు..!

- మరో 14 రోజులు పొడిగించిన ప్రభుత్వం
- సచివాలయ సిబ్బందితో విస్తృత స్థాయిలో సర్వే
- అర్హులైన ప్రతి ఒక్కరినీ జాబితాలో చేర్చడమే లక్ష్యం

8

బస్టాండ్‌లో.. అటో..ఇటో..ఎటో..



8

- వరుస ప్రమాదాలతో భయాందోళన
- స్త్రీ శక్తి పథకంతో మరింత పెరిగిన రద్దీ

దివ్యాంగుల్లో ప్రతిభను వెలికితీసేందుకు కృషి

- శాప్ చైర్మన్ రవి నాయుడు
- దివ్యాంగుల బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

విద్యార్థినిపై అత్యాచారం

- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కోర్టులో లొంగిపోయిన పిన్నెల్లి వెంకటరెడ్డి

రూ. 9 కోట్లు మాయం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌ను ఆశ్రయించిన కురగల్లు కో ఆపరేటివ్ బాధితులు

6

మాచర్లలో ప్రేమ జంట ఆత్మహత్య

- కుడి కాలువలో దూకి బలవన్మరణం
- యువతి మృతదేహం లభ్యం.. యువకుడు గల్లంతు

బకాయి భారం

- మున్సిపాలిటీలకు చేకూరని ఆస్తి పన్ను ఆదాయం
- ప్రభుత్వ సంస్థల నుంచి రూ.52.36 కోట్లు పెండింగ్
- ఏళ్ల తరబడి వసూలు కాని వైనం..

మునిసిపాలిటీలకు.. ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్ను బకాయిలు ఏళ్ల తరబడి పేరుకుపో తున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాల్టీలకు ప్రభుత్వ సంస్థలు రూ.52.36 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలు చెల్లిస్తే పట్టణాల్లో ప్రజలకు అవసరమైన ప్రగతి పనులు చేపట్టవచ్చు. బకాయిల వసూలు కోసం మునిసి పాల్టీలకు అయా ప్రభుత్వ కార్యాలయాల అధి పతులకు లేఖలు రాస్తున్నా ప్రయోజనం లేదు. ఆస్తి పన్ను చెల్లించేందుకు ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల కాలేదంటూ అధికారులు పురపాలకులకు సమాధానం ఇస్తున్నారు.

పల్నాడు జిల్లాలోని నరస రావుపేట మునిసిపాల్టీకి రూ.3 కోట్లు, సత్తెనపల్లి రూ.1.05 కోట్లు, మాచర్ల కోటి రూపాయలు, చిలక లూరిపేట రూ.80 లక్షలు, దాచేపల్లి రూ.16 లక్షలు, వినుకొండ రూ.46 లక్ష లు, పిడుగురాళ్ల రూ.37 లక్షలు, గురజాల మునిసి పాల్టీకి రూ.29 లక్షలు బకాయిలు వసూలు కావాల్సి ఉంది.

బాపట్ల జిల్లా కేంద్రం బాపట్ల మునిసిపాల్టీలో రూ.1.40 కోట్లు, రేపల్లె రూ.83 లక్షలు, చీరాల రూ.1.09 కోట్లు, అద్దంకి మునిసిపాల్టీలో రూ.32 లక్షలు ప్రభుత్వ సంస్థల బకాయిలు పేరుకుపోయాయి. ఈ బకాయిలు ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా వసూలు అయ్యే పరిస్థితులు లేవని సదరు అధికారులు చెబుతున్నారు. ఆస్తి పన్ను బకాయిలు గురించి లేఖలు రాస్తున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదంటున్నారు.



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మునిసిపాల్టీలకు ప్రైవేట్ సంస్థల కంటే ప్రభుత్వ సంస్థల ఆస్తి పన్ను మొండి బకాయి అధికంగా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాల ఆస్తి పన్ను బకాయి కోసం అధికారుల చుట్టూ మునిసిపల్ సిబ్బంది ప్రదక్షిణలు చేస్తున్నారు. మునిసిపాల్టీలు విద్యుత్ బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగితే ప్రభుత్వ సంస్థ అని కూడా చూడకుండా విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తారు. అటువంటిది మునిసిపాల్టీకి మాత్రం ఆస్తి పన్ను చెల్లించే విషయంలో అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్యాలయాలు.. సంస్థలకు సంబంధించి రూ.39.62 కోట్లు ఆస్తి పన్ను బకాయి ఉంది.కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు.. సంస్థలకు సంబంధించి రూ.12.74 కోట్ల ఆస్తి పన్ను బకాయి (మిగతా 8వ పేజీలో)

హద్దు మీరి అమ్మకాలు

- ఏపీలో తెలంగాణ పంట ఉత్పత్తుల విక్రయం
- ఆక్షేపిస్తున్న స్థానిక రైతులు..

దాచేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతులు 'హద్దు' మీరుతూ..తమకు నష్టం కలిగిస్తున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని ఆంధ్ర రైతులు ఆరోపిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ధాన్యం, పత్తి, మిరపకాయలు ఆంధ్రాలో అమ్మకాలు సాగుతున్నాయని మండిపడుతున్నారు. మండలంలోని నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో.. పొరుగు రాష్ట్రం నుంచి తెచ్చిన మిర్చి, పత్తి, మిల్లుల్లో ధాన్యం అమ్మకాలు చేస్తున్నారు. గతంలో తెలంగాణాలో ధాన్యం అమ్మకానికి వెళితే అక్కడి రైతులు, వ్యాపారులు, అధికారులు తమను అడ్డుకున్నారని ఆంధ్ర రైతులు గుర్తుచేస్తున్నారు. కానీ, ఇక్కడ మాత్రం పక్క రాష్ట్రం ఉత్పత్తులను విక్రయించడంతో పాటు.. ఈ ప్రాంతంలోని రైతులకు అంది స్తున్న యూరియా బస్తాలు కూడా తీసుకెళ్లడంపై ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. ఇక్కడి సబ్సిడీ యూరియా పొంది, మళ్లీ ఇక్కడే పంట ఉత్పత్తులు విక్రయించడాన్ని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. తెలంగాణ ధాన్యం అధికంగా ఆంధ్రాకు రావడంతో ఆంధ్రా రైతుల పంట ఉత్పత్తులకు డిమాండ్ ఉండటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై అధికారులు దృష్టి సారించి ఆంధ్రా రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తు న్నారు. ప్రధానంగా తెలంగాణాలోని కోదాడ, మిర్యాలగూడ, హుజూర్ నగర్, అడవిదేవులపల్లి, దామరచర్ల మండలాల రైతులు తమ పంట ఉత్ప త్తులను ఆంధ్రాకు తరలిస్తున్నారు. కావున, సరిహద్దు ప్రాంతాలైన పొందుగల, తంగెడల వద్ద నిఘా మరింత పెంచాలని వారు కోరుతున్నారు.



నడికూడిలోని మిల్లుల వద్ద నిలిచిన ధాన్యపు లోడుతో ఉన్న ట్రాక్టర్లు

క్రీడా కిట్లు వచ్చేశాయ్



ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ

గుంటూరు(విద్య): డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన క్రీడా పరికరాలు సరఫరా చేసింది. ఒక్కో పాఠశాలకు రూ.17వేలు, రూ.30వేలు విలువైన కిట్లు ఇప్పటికే చేరాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు దాదాపు 3వేలకుపైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు 6 లక్షల మందికి పైగా విద్యార్థులున్నారు. పాఠశాలల్లో విశాలమైన క్రీడా ప్రాంగణాలు, నిష్ణాతులైన ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నారు. అయితే క్రీడా పరికరాల లేమి కారణంగా విద్యార్థులకు సరైన శిక్షణ అందడం లేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోటే క్రీడలకు మెరుగైన అవకాశం కల్పించే దిశగా ఏర్పాట్లు చేసింది.

క్రీడా కిట్లు ఇలా..

షటిల్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, వాలీబాల్, టెన్నికాయిట్, ఖో-ఖో, హ్యాండ్‌బాల్ క్రీడా పరికరాలు.. క్యారమ్స్, చెస్ బోర్డులు క్రీడా కిట్లలో ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలకు రూ.10 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.17వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.25 వేల నుంచి రూ.30 వేలు విలువైన క్రీడా పరికరాలు ప్రభుత్వం పంపించినట్లు ఉపాధ్యాయులు వెల్లడించారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్లకు దిశా నిర్దేశం చేయనున్నారు.



క్యారమ్స్ తదితర క్రీడా పరికరాలు

రాజధాని మాదిరిగానే రెండవ దఫా పూలింగ్

- రైతులతో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కోసం భూ సమీకరణ ద్వారా భూములు ఇచ్చిన రైతులకు మాదిరిగానే రెండవ దఫా భూ సమీకరణ రైతులకు న్యాయం జరుగుతుందని పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. సోమవారం సాయంత్రం అమరావతి మండలంలో భూసమీకరణ చేయనున్న నాలుగు రెవెన్యూ గ్రామాల్లో ఒకటైన పెదమద్దూరులో రైతులతో గ్రామసభ నిర్వహించారు. రైతులను ఉద్దేశించి ప్రవీణ్ మాట్లాడుతూ తొలుత కర్లపూడి, వైకుంఠపురం గ్రామాల రైతులు తనను కలసి తమ భూములను పూలింగ్ ద్వారా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరడం జరిగిందని అన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తే ఆయన సుముఖత వ్యక్తం చేసి.. రైల్వేలైను, ఇన్నర్ రింగ్‌రోడ్డు వెళ్లే మార్గంలోని వైకుంఠపురం, పెదమద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాల్లో భూములు తీసుకునేందుకు నిర్ణయించారని తెలిపారు వాటితో పాటు ఎండ్రాయి, కర్లపూడి రెవెన్యూలో ఉన్న చావపాడు, లేమల్లెలోని భూములను కూడా తీసుకునేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. రాజధాని అమరావతిలో మాదిరిగానే రైతులకు లబ్ధిని చేకూర్చి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. గతంలో మాదిరిగా ఆలస్యం చేయకుండా.. రైతులకు సత్వరం న్యాయం జరిగేలా చూడటం జరుగుతుందన్నారు. భూ సమీకరణలో బలవంతం ఏమీ లేదని ఇష్టం ఉన్నవారి భూములు తీసుకోవడం, ఇవ్వని వారి భూములను గ్రీన్ జోన్‌లో ఉంచడం జరుగుతుందన్నారు. గ్రామసభలో పాల్గొన్న రైతులు తమకు రిటర్నబుల్ ప్లాట్‌లు ఎక్కడ కేటాయిస్తారని, కౌలు ఎప్పుడు చెల్లిస్తారని, భూములపై తీసుకున్న రుణాల పరిస్థితి ఏమిటని, పిల్లలకు భూములు ఇవ్వాలంటే వారికి రిజిష్టర్ చేయాలా లేక తమ అంగీకారం మేరకు సీఆర్డీఏ కేటాయిస్తుందా అని పలు అనుమానాలు వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రాజధానిలో జరిగిన విధంగానే వారికి జరుగుతుందని సమాధానం ఇచ్చారు. పూలింగ్ జరిగే గ్రామాల్లో సీఆర్డీఏ అధికారులు, సిబ్బంది నివాసం ఉండి తమ కార్యకలాపాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు గ్రామస్తులు థ్యాంకూ సీఎం సార్ పేరుతో ప్లకార్డులు ప్రదర్శించారు. సభలో తహసీల్దార్ డానియేలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



- థ్యాంక్యూ సీఎం సార్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్, రైతులు

20న శ్రీనివాసుని కల్యాణం

పిడుగురాళ్లలో స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



8

టీటీడీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

క్రీస్తు బోధనలు అందరూ ఆచరించాలి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు చేసిన బోధనలను అందరూ ఆచరించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. కనపర్రు గ్రామ పరిధిలోని మల్లాయపాలెం గ్రామంలో సోమవారం జరిగిన పునీత శౌరివారి మహోత్సవంలో బిషప్ భాగ్యయ్యతో కలసి ఆయన పాల్గొన్నారు. నూతనంగా నిర్మించనున్న ప్రార్థన మందిరానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పుల్లారావు మాట్లాడుతూ.. క్రీస్తు చూపిన మార్గంలో పయనించి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. బిషప్ భాగ్యయ్య మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలని, శత్రువును కూడా ప్రేమించే మనస్తత్వం కలిగి ఉండాలన్నదే దేవుని కోరిక అన్నారు. దేవుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు సత్యనారాయణ, నాగ పూర్ణచంద్రరరావు, సింగయ్య, జయప్రసాదు, జయరాజు, రాఘవయ్య ఉన్నారు.



పునీత శౌరివారి మహోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుల్లారావు, బిషప్ భాగ్యయ్య

అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలి

- పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

యడ్లపాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ సేవలను ఆరా తీసిన ఆయన ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు, జాతీయ ఆరోగ్య పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనం పురోగతిని పరిశీలించారు. అనంతరం వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. దిత్వా తుఫాను నేపథ్యంలో అత్యవసర సేవలు అందించేందుకు సిద్ధం కావాలన్నారు. నెలలు నిండిన గర్భిణుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సురక్షితమైన, వైద్య సేవలు అందుబాటులో ఉండే ప్రాంతానికి చేర్చాలని సూచించారు. జ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నెల 21న పల్స్ పోలియో కార్యక్రమంపై గ్రామాల్లో అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మండలంలో వినికిడి లోపంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించి ఈ నెల 7న చిలకలూరిపేటలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో జరిగే ప్రత్యేక వైద్య శిబిరానికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భరద్వాజ, సూపర్‌వైజర్ రాజశేఖర్ పాల్గొన్నారు.



హెల్త్ యూనిట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

బెంబేలెత్తిస్తున్న వీధికుక్కలు



వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

- గత నెలలో 67 మందికి గాయాలు

దుర్గి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గిలో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. కొన్నేళ్లుగా వీధి కుక్కల బెడద నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో వాటి సంతతి పెరిగిపోయింది. రహదారుల వెంట తిష్టవేస్తూ ప్రజలను వెంటాడి కరుస్తున్నాయి. గత నెలలో 67 మంది కుక్క కాటుకు గురయ్యారు. ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించిన వారి సంఖ్య అధికంగా ఉంది. చిన్న పిల్లలను లక్ష్యంగా చేసుకొని కుక్కలు దాడి చేస్తున్నాయి. సోమవారం మూడేళ్ల చిన్నారి శ్రీలక్ష్మి ఇంటి బయట ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. స్థానికులు వాటిని తరిమేయడంతో ప్రమాదం తప్పింది. దుర్గి ప్రాథమిక వైద్యశాలలో నిత్యం నలుగురు కుక్కల దాడిలో గాయపడిన వారు వైద్యం కోసం వస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని కుక్కల బెడదను నియంత్రించాలని బాధితులు కోరుతున్నారు.



వీధి కుక్కల దాడిలో గాయపడ్డ శ్రీలక్ష్మి

వరి కోతలు వాయిదా వేసుకోండి

- జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు

నకరికల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కల్లాల్లో ధాన్యాన్ని రైతులందరూ ఇళ్లకు చేర్చుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు రైతులకు సూచించారు. సిద్ధంగా వరి కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి నకరికల్లు, నరసింగపాడులోని పంట పొలాలను పరిశీలించారు. దిత్వా తుఫాన్ పరిస్థితుల దృష్ట్యా రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ-పంటలో నమోదు చేసు కున్న రైతులంతా రైతు సేవా కేంద్రాల్లో పీపీసీ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. గ్రేడు - 1 రకం ధాన్యం ధర రూ.1792, సాధారణ రకం బస్తాకు రూ.1777 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. గోనె సంచులు, హమాలీల చార్జీలు, రవాణా చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో కే దేవదాసు, ఏఈవో కె.దిలీప్‌కుమార్, ఏఏలు షేక్ ముస్తక్, సునీలా పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు

జంక్షన్ కాలనీకి మహర్దశ

మౌలిక వసతులకు రూ.50 లక్షల జడ్పీ నిధులు

రెంటచింతల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాచర్ల - గుంటూరు రహదారి పక్కనే జంక్షన్ కాలనీ ఏర్పాటు చేసి 19 సంవత్సరాలు గడిచిపోయాయి. అప్పటి మాచర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పట్టుదలతో 2006లో 195/3 సర్వే నెంబరులో 18 ఎకరాల ఆలయ భూమి ఉండగా.. 6 ఎకరాలను 180 మందికి నివేశన స్థలాలుగా కేటాయించారు. కానీ, మౌలిక వసతులు మాత్రం కల్పించలేదు. హెచ్‌టీ లైన్ కూడా ఈ గృహాల మీద నుంచే పోవడంతో గృహ నిర్మాణాలకు చొరవ చూపలేదు. కూటమి అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి జంక్షన్ కాలనీ సమస్యను సర్పంచ్ మందలపు హనిమిరెడ్డి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే చొరవతో స్పందించిన అధికారులు రూ.50లక్షల నిధులను విడుదల చేశారు. 80 మీటర్ల పొడవు, 6.5 మీటర్ల వెడల్పుతో 13 రహదారులను, డ్రైయినేజ్ కూడా నిర్మిస్తున్నారు.



కాలనీలో నిర్మిస్తున్న సైడ్ కాలువలు

కార్మిక చట్టాల నిర్వీర్యంపై యుద్ధభేరి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య



సభలో ప్రసంగిస్తున్న గుజ్జుల ఈశ్వరయ్య, వేదికపై సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హక్కులను హరించేలా పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వంపై యుద్ధభేరి మోగించేందుకు కార్మిక లోకం సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. గుంటూరు సంగడిగుంట రేగుల రాఘవయ్య భవన్‌లో సోమవారం హమాలీ (ముఠా) ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన ఆంజనేయులు అధ్యక్షతన కార్మిక నేత జీవీ కృష్ణారావు 9వ వర్ధంతి సభ జరిగింది. ముఖ్య అతిథిగా హజరైన గుజ్జుల ఈశ్వర్యయ్య మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో మూతబడుతున్న పరిశ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావుకు జీవీకే అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్, వెలుగూరి రాధాకృష్ణ మూర్తి, కోట మాల్యాద్రి, అకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, కాసా రాంబాబు, పులి సాంబశివరావు, రాజేంద్ర, బందెల నాసర్, జి.పుప్పాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు పునీత శౌరివారి తిరునాళ్ళ మహోత్సవం



విద్యుత్ దీపాలంకరణలో ముట్లూరు పునీత శౌరి దేవాలయం

వట్టిచెరుకూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని ముట్లూరు గ్రామంలో పునీత శౌరి వారి దేవాలయ తిరునాళ్ళ మహోత్సవం డిసెంబరు 3న జరగనుంది. తిరునాళ్లను వైభవంగా జరుపుకొనేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. తిరునాళ్ళను పురస్కరించుకొని దేవాలయ ప్రాంగణం, ప్రధాన వీధుల్లో వివిధ దుకాణాలతో పండుగ వాతావరణం నెలకుంది. బుధవారం బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య పలువురు ఫాదర్లతో కలసి దేవాలయ ప్రాంగణంలో సమిష్టి బలిపూజా కార్యక్రమంలో ప్రార్థనలు నిర్వహిస్తారని ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు ఫాదర్ దిలీప్ కుమార్ తెలిపారు. కాగా, తిరునాళ్ళ మహోత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకొనేందుకు దేవాలయ పెద్దలు, గ్రామస్థులు పోలీసులకు పూర్తి సహకారం అందించారని సౌత్ జోన్ డీఎస్పీ భానోదయ కోరారు.

ముగ్గురు చోరుల అరెస్టు

● నిందితుల్లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ ● 26.5 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరుస చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గోరంట్లకు చెందిన చిల్లర సురేష్, విజయవాడ రామలింగేశ్వర నగర్‌కు చెందిన కాజా నాగ వీర భాస్కరరావు, శివ నాగరాజు కాలనీ నాలుగో లైన్‌కు చెందిన లంకా రాజేష్‌ను అరెస్టు చేసి వారి నుంచి రూ 26.50 లక్షలు విలువ చేసే 227 గ్రాముల బంగారు, 182 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. గుంటూరు సంపత్ నగర్‌కు చెందిన అవ్వారి వెంకట అప్పయ్య శాస్త్రి ఈ నెల 8న ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి తిరుపతి వెళ్లారు. 12న తిరిగి ఇంటికి రాగా మెయిన్ డోర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి పరిశీలించగా దొంగలు బీరువా తాళాలు పగలగొట్టి అందులో దాచిన 152 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేసి సాంకేతిక ఆధారాలతో నిందితులను అరెస్ట్ చేశారు. వారిని విచారించగా నిందితులు మరో మూడు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. నిందితుల్లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ చిల్లర సురేష్ ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. గోరంట్లకు చెందిన అతడు పగలు రెక్కీ నిర్వహించి రాత్రి ఇల్లు లూటీ చేయడంలో దిట్ట అని చెప్పారు. అతడిపై అధికారికంగా 78, అనధికారికంగా 150కి పైగానే కేసులు ఉండవచ్చని తెలిపారు. మిగతా ఇద్దరు నిందితులకు ఇతడితో తెలంగాణలోని హుజూర్‌నగర్ జైల్లో పరిచయం ఏర్పడిందని చెప్పారు. కేసును ఛేదించి సొత్తు రికవరీ చేసిన అధికారులు సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలతో పాటు నగదు రివార్డును అందించి అభినందించారు.

పిన్నెల్లి సోదరుల అరాచకాలు కనపడలేదా

● కాసుపై ఎమ్మెల్యే జూలకంటి మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, పక్కన ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పిన్నెల్లి సోదరులు ఎన్నికల ముందు తర్వాత మాచర్లలో ఎన్ని అరాచకాలు చేశారో గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డికి కనబడలేదా అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రశ్నించారు. సోమవారం నరసరావుపేటలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, తాను మాచర్ల నుంచి ఎప్పుడూ పారిపోలేదని, కాసు మహేశ్‌రెడ్డి ఆయన తండ్రి కృష్ణారెడ్డి నరసరావుపేట వదిలి పారిపోయి గురజాల వచ్చారని అన్నారు. విగ్రహాల దొంగ, అవినీతి పరుడు, దోపిడి దారుడు వైసీపీకి జిల్లా అధ్యక్షుడిగా ఉండటం దౌర్భాగ్యమని అన్నారు.

● దోచుకున్న డబ్బుతో కాసు సెంట్రల్ హాల్

గురజాలలో దోపిడి చేసిన డబ్బుతో కాసు సెంట్రల్ హాల్ కట్టారని ఆరోపించారు. వరికపూడిశల ప్రాజెక్టు తీసుకు వస్తామని 50 ఏళ్ళు కాసు కుటుంబం పల్నాడు ప్రజల్ని మోసం చేసిందన్నారు. విగ్రహాల దొంగ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కాసు మహేశ్‌రెడ్డికి ఉన్న లింకేమిటని ప్రశ్నించారు. ఒక సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి కాసు మహేశ్‌రెడ్డి తాతను ఎదుర్కొన్న మొనగాడు తన తండ్రి జూలకంటి నాగిరెడ్డి అన్నారు. ఇద్దరు ముస్లింలను హత్యచేసిన కేసులో చిన్నతనంలోనే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముద్దాయని అన్నారు. ఆత్మకూరు సంఘటన జరిగినప్పుడు తాను హైదరాబాద్‌లో ఉన్నానని చెప్పారు. కాసుకు ధైర్యం ఉంటే రుజువు చేయాలని, అలా చేస్తే తాను రాజకీ యాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని అన్నారు. సమావేశంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో వ్యాస రచన పోటీలు



సమావేశంలో మాట్లాడుకుంటున్న ఉన్నత విద్య మండలి చైర్మన్ మధుమూర్తి, వీసీ గంగాధరరావు తదితరులు

ఏఎన్‌యూ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)లో విక్సిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్-2026 వ్యాస రచన పోటీలు సోమవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తి, ప్రొఫెసర్ జి.రోశయ్య, డాక్టర్ మాథ్యూస్ శ్రీరంగం నేతృత్వం వహించారు. రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల విభాగాలకు చెందిన 40 మంది ప్రొఫెసర్లు పా ల్గొని 100 వ్యాసాలు మూల్యాంకనం చేసి, 3,659 వ్యాసాలు పరిశీలిం చారు. యువజన సేవల శాఖ నుంచి వీవీఎస్ మల్లేశ్వరరావు సూచన లు అందించారు. మూల్యాంకనం పూర్తయిన తర్వాత ఫలితాలను యువజన సేవల కమిషనర్‌కు అధికారికంగా పంపించినట్లు ఉన్నత విద్య మండలి వెల్లడించింది.

జనవరి 7, 8 తేదీలలో జాతీయ సదస్సు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జనవరి 7,8వ తేదీలలో జాతీయ సదస్సు జరగనుంది. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఉపకులపతి ప్రొఫెసర్ కె.గంగాధరరావు సోమవారం విడుదల చేయగా, రెక్టార్ ప్రొఫెసర్ ఆర్. శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ తరపున ప్రొఫెసర్ జి.రోశయ్య ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.

గోడపత్రిక ఆవిష్కరణ

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల సాధన సమన్వయకర్తలకు సోమవారం వర్సిటీలో ఒకరోజు వర్క్ షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ ఉన్నత విద్యా మండలి-ఏఎన్‌యూ సంయుక్తంగా డ్రైవింగ్ ఎక్సలెన్స్-ఇన్‌స్టిట్యూషనల్ స్ట్రాటజీస్ అనే అంశంపై నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన చైర్మన్ ఆచార్య మధుమూర్తి క్వాంటం టెక్నాలజీ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ఆచార్య విజయ భాస్కరరావు, ప్రత్యేక గౌరవ అతిథిగా ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కే.గంగాధరరావు హాజరయ్యారు.

దివ్యాంగుల్లో ప్రతిభను వెలికితీసేందుకు కృషి

● శాప్ చైర్మన్ రవి నాయుడు ● దివ్యాంగుల బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



దివ్యాంగుల బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న శాప్ చైర్మన్ రవి నాయుడు, ఎండీ భరణి, ఎమ్మెల్యే నసీర్, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల లోని ప్రతిభను వెలికితీసి వారికి ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. స్థానిక బీఆర్ స్టేడియంలో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రస్థాయి దివ్యాంగుల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, శాప్ ఎండీ భరణితో కలిసి రవినాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో రవినాయుడు మాట్లాడుతూ, దివ్యాంగులకు తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం తీసుకువచ్చిన క్రీడాపాలసీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీఆర్ స్టేడియంను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్ ఖాన్ మాట్లాడుతూ, పోటీలకు పెద్ద ఎత్తున క్రీడాకారులు హాజరయ్యారని అన్నారు. మంగళవారంతో ఈ పోటీలు ముగుస్తాయని, విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, టీడీపీ నాయకులు అబ్బూరు మల్లి, మన్నవ వంశీ, శాప్ సభ్యులు సంతోష్ కుమార్, జగదీశ్వరి, కార్పొరేటర్లు మీరావలి, అశోక్, కోచ్ లోహిత్, నళిని తదితరులు పాల్గొన్నారు.

9 కోట్లు మాయం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్‌ను ఆశ్రయించిన కురగల్లు కో ఆపరేటివ్ బాధితులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొసైటీ పేరుతో దాదాపు రూ 9.కోట్లు దోచుకున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంగళగిరి రూరల్ పరిధిలోని కురగల్లుకు చెందిన గ్రామస్థులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.9 కోట్లు డిపాజిట్లు సేకరించి, వాటిని మాయం చేశారని వాపోయారు. కష్ట సమయంలో అక్కరకు వస్తాయని దాచి పెట్టుకుంటే, వాటిని పక్కదారి పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించి తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ, నీరుకొండ, కురగల్లు గ్రామాలకు కలిపి ది కురగల్లు ప్రైమరీ అగ్రికల్చరల్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటి లిమిటెడ్ పేరుతో ఏర్పాటు చేసి తమను మోసం చేశారని పేర్కొన్నారు. దీనిపై సొసైటీలో తీర్మానం చేసి ఈ ఏడాది అక్టోబరు నెలలో సీఈవో రమేష్ అనే అధికారిని, సహకరించిన సిబ్బందిని తొలగించారని వివరించారు. వారి వద్ద ఉన్న సొమ్మును ఇప్పటివరకు బ్యాంకుకు జమ చేయలేదన్నారు. సొమ్మును రికవరీ చేసి తమ ఖాతాలకు జమ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరినట్టు చెప్పారు. దీనిపై త్వరలోనే డీసీసీబీ చైర్మన్‌ను కలవనున్నట్టు స్పష్టం చేశారు.



ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన బాధితులు

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి 30 రోజుల జైలు

● మరో నలుగురికి రూ. 10 వేల చొప్పున జరిమానాలు



క్రోసూరులో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

క్రోసూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి సత్తెనపల్లి కోర్టు 30 రోజులు జైలు శిక్ష విధించింది. మరో నలుగురికి జరిమానాలు విధించింది. క్రోసూరులో సోమవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో కాకరపర్తి కోటి రత్నం అనే వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ చిక్కాడు. పోలీసులు అతన్ని అరెస్టు చేసి సత్తెనపల్లి కోర్టులో హాజరు పరచగా 30 రోజుల జైలు శిక్షను విధించింది. అలాగే మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న మరో నలుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికీ రూ. 10 వేల చొప్పున జరిమానాలు విధించింది. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు తెలియజేశారు.

కోర్టులో లొంగిపోయిన పిన్నెల్లి వెంకటరెడ్డి



కోర్టు వద్ద పిన్నెల్లి వెంకటరెడ్డి

వెల్దుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన వెల్దుర్తి మండలం గుండ్లపాడు జంట హత్యల కేసులో ఏ8 నిందితుడిగా ఉన్న కండ్లకుంట సర్పంచ్ పిన్నెల్లి వెంకటరెడ్డి సోమవారం మాచర్ల పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయారు. గత మే నెల 24వ తేదీన గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావులును బోదలవీడు సమీపంలో హత్యకు గురయ్యారు. ఈ కేసులో పోలీసులు 9 మందిని నిందితులుగా చేర్చగా వీరిలో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఏ6, ఏ7లుగా వైసీపీ నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఉన్నారు. కాగా ఏ8నిందితుడిగా ఉన్న పిన్నెల్లి వెంకటరెడ్డి మాచర్ల కోర్టులో లొంగిపోగా న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్ గుంటూరు జిల్లా జైలుకు రిమాండ్ విధించారు.

విద్యార్థినిపై అత్యాచారం

● కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

చేబ్రోలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో లోబర్చుకొని తనపై ఓ యువకుడు అత్యాచారం చేశాడని ఓ విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, తెనాలి పట్టణానికి చెందిన ఓ యువతి, చేబ్రోలు మండలంలోని ఒక ప్రైవేటు విద్యాసంస్థలో ఫార్మసీ చదువుతూ ఓ ప్రైవేటు వసతి గృహంలో నివసిస్తోంది. అదే వసతి గృహంలో ఉన్న సహచర విద్యార్థినుల ద్వారా కృష్ణాజిల్లా ఘంటసాల ప్రాంతానికి చెందిన నందు అనే వ్యక్తితో ఆమెకు పరిచయం ఏర్పడినట్లు సమాచారం. అతను మాయమాటలు చెప్పి యువతిని నారాకోడూరు, గుంటూరు ప్రాంతాలలోని లాడ్జీలకు తీసుకెళ్లి అక్కడ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనను వీడియోలు చూపించి బెదిరిస్తున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు బాధిత యువతి ఆదివారం చేబ్రోలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా సోమవారం ఘటన జరిగిన లాడ్జిని నారాకోడూరులో పరిశీలించారు.

మాచర్లలో ప్రేమ జంట ఆత్మహత్య

● కుడి కాలువలో దూకి బలవన్మరణం

● యువతి మృతదేహం లభ్యం.. యువకుడు గల్లంతు



వీర్ల గోవర్ధన్ (ఫైల్‌ఫొటో)

మాచర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణానికి చెందిన ప్రేమ జంట సోమవారం నాగార్జున సాగర్ కుడి కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణానికి చెందిన దాసరి లక్ష్మి (22), వీర్ల గోవర్ధన్ (20) గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. వారి వివాహానికి పెద్దల అంగీకారం కోరారు. వేర్వేరు సామాజిక వర్గాలు కావడంతో ఇరువైపుల నుంచి అంగీకారం లభించలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఇరువురు కాలువలో దూకారు. సమీపంలో స్నానం చేస్తున్న కొందరు యువకులు గమనించి కాపాడేందుకు ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. నీటి ప్రవాహానికి ఇరువురు కొట్టుకుపోయారు. యువతి దాసరి లక్ష్మిని స్థానికులు కాలువ నుంచి బయటకు తీసినప్పటికీ అప్పటికే మృతిచెందింది. కాగా గోవర్ధన్ కోసం గాలింపు చేపట్టారు. సంఘటనా స్థలం వద్దకు బంధువులు చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. కాగా, దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 580.10 అడుగులు ఉంది. ఇది 283.30 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6,006 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5,226 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 24,481 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 37,513 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లోగా 37,513 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 43.54 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి మూడు వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదలవుతోంది.

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పింఛన్లు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో పింఛన్లు ఇస్తున్నామని, పేదలకు అండగా నిలబడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం అన్నారు. అన్ని సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం రికార్డులు సృష్టిస్తుందన్నారు. భారీ బడ్జెట్ అయినప్పటికి సీఎం చంద్రబాబునాయుడు అనుభవంతో పటిష్టంగా అమలు చేస్తున్నారని చెప్పారు. పింఛన్ల కోసం ఏటా రాష్ట్ర ప్రభుత్వం రూ 33 వేల కోట్లు ఖర్చుపెడుతుందన్నారు. మహారాష్ట్ర లాంటి పెద్ద రాష్ట్రంలో పింఛన్లకు కేవలం రూ.8 వేల కోట్లు మాత్రమే ఖర్చుచేస్తున్నారని, తెలంగాణలో రూ.2 వేల కోట్లు, తమిళనాడులో రూ.వేయి కోట్లు, కర్నాటకలో రూ.600 కోట్లు మాత్రమే ఖర్చుచేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు ఇవ్వడంతో పాటు పింఛన్ల కోసం రూ. 2700 కోట్లు పంపిణీ చేయడం ఆషామాషి కాదన్నారు. కొత్తగా 5 లక్షల ఇళ్ళు మంజూరు చేస్తున్నామని, నాణ్యతతో ఇళ్ళ నిర్మాణం జరుగుతుందని కొమ్మాలపాటి శ్రీధర్ చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	126, 135, 146
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

37,392 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 39,823 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 37,392 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,063 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17300
నెంబరు. 5	11000	15000
273	---	---
341	10500	17000
4884	---	---
సూపర్ 10	---	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15200
షార్క్-1	----	---
బ్యాడిగి	10500	17400
దేవనూరు డీలక్స్	11000	16700
ఆర్మూరు	10500	13300

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	11000	17400
నెంబరు. 5	---	---
273	---	---
341	12000	17000
4884	---	---
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10500	15000
సింటెంటా బ్యాడిగి 5531	11000	17500
దేవనూరు డీలక్స్	10500	16300
తాలుకాయలు	5000	8000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

పెండింగ్ కేసుల్లో నిందితులను అరెస్టు చేయాలి

నకరికల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసుల్లో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని సత్తెనపల్లి రూరల్ సీఐ పీ కిరణ్ అన్నారు. సోమవారం నకరికల్లు పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ కే సతీష్‌తో సమావేశమై మండలంలోని పరిస్థితుల గురించి ఆరా తీశారు. నేరాలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. మండలంలో శాంతిభద్రతలపై చర్చించారు. రికార్డులను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పలు సూచనలుచేశారు.

శాలివాహన సంఘం అధ్యక్షుడిగా రామకృష్ణ

పిడుగురాళ్ల: పట్టణ శాలివాహన సంఘ సమావేశం సోమవారం జరిగింది. సంఘం నూతన అధ్యక్షుడిగా జమ్మిశెట్టి రామకృష్ణ, ప్రధానకార్యదర్శిగా రాజవరపు రాఘవేంద్రరావు, కోశాధికారిగా చీరాల వెంకటేశ్వర్లు, మీడియా కన్వీనర్‌గా నడికూడి వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రసిడెంట్‌గా చాత్రాజుపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా మొగిలిచర్ల కోటేశ్వరరావు, సిరికొండ శేషగిరిరావు, మద్దిగుంట్ల శివశంకర్, చల్లగిరి సాంబయ్యతో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు సత్కారం

సత్తెనపల్లి: నరసరావుపేటలో సోమవారం జరిగిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంలో జిల్లాలో ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలోని ఐసీటీసీ సెంటర్ ల్యాబ్ టెక్నీషియన్ సుభానీ నరసరావుపేట ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ నుంచి అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో రవి పాల్గొన్నారు.

చదువుతో పాటు విలువలు ముఖ్యం

ముప్పాళ్ళ: చదువుతో పాటు విలువలు ముఖ్యం అని ఎస్‌ఐ అనీల్‌కుమార్ అన్నారు. మండలంలోని గొళ్ళపాడు కేజీబీవీలో సోమవారం హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విలువలతో కూడిన విద్య అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలంటే నైతిక విలువలు కలిగి ఉండాలన్నారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు సోమశేఖర్ ఆర్థిక సహకారంతో అమ్మానాన్న లేని చిన్నారులకు చలి కోట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఝాన్సీ, ఏపీఎం బాలస్వామి, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు పాల్గొన్నారు.

ధాన్యంలో తేమ 17శాతమే ఉండాలి

వరి కోతకోసిన రైతులు తేమ 17శాతం ఉండేలా చూసుకోవాలని ఏఓ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలో వరికోతలు ప్రారంభం కావడంతో గొల్లపాడు గ్రామంలో కోసిన వరి పంటను ఏఓ ముప్పాళ్ళ మండల జీడీసీఎస్ సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో తమ ధాన్యాన్ని అమ్ముకోవాలనుకుంటే గ్రామంలోని ఆర్‌ఎస్‌కేలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ముప్పాళ్ళ ఏఈఓ ఎన్ శేషుబాబు, జీడీసీఎస్ మండల సిబ్బంది, చాందినీ పాల్గొన్నారు.

భగవద్గీత ఆచరణతో సన్మార్గంలో సమాజం

అమరావతి: వ్యాసమహర్షి అందించిన భగవద్గీత ఆచరణతో సమాజం సన్మార్గంలో పయనిస్తుందని భవఘ్ని గురువులు తమ సందేశం ఇచ్చారు. సోమవారం గీతాజయంతి సందర్భంగా వైకుంఠపురం వ్యాసదేవాలయంలో వేడుకలు జరిగాయి. భవఘ్ని శిష్యులు వ్యాస ఆరాధన, గీతా ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. వందలాది మంది భవఘ్ని శిష్యులు పాల్గొన్నారు.

సాంబశివరావు సేవలు ఆదర్శనీయం

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో విఘ్నేశ్వరాలయ నిర్వహణలో దండా సాంబశివరావు అందించిన సేవలు ఆదర్శనీయమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం సాంబశివరావు పెదకర్మ కార్యక్రమంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల అధిపతి వైవీ ఆంజనేయులు, మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ, వికాస్ సంస్థల డైరక్టర్‌లు, టీడీపీ నాయకులు, కుటుంబసభ్యులు సాంబశివరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

తండాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించండి

అచ్చంపేట: 500 జనాభాగల తండాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలని బాణావత్ రామ కోటేశ్వర్‌నాయక్ సోమవారం ఎంపీడీవో కోయా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. మండలంలో మాదిపాడు గ్రామ శివారులోని జడపల్లి మోటు తండా, కంచుబోడు తండా, గింజుపల్లి తండా, సంద్ర తండా, కొండూరు పంచాయతీలోని తండాలను కూడా ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలని కోరారు.

నూతన ఎన్‌జీవో అధ్యక్షుడికి సత్కారం

క్రోసూరు: పెదకూరపాడు యూనిట్ ఎన్‌జీవో అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగి కోసిపోగు వెంకటరావుకు సోమవారం క్రోసూరులో ఘన సత్కారం జరిగింది. వివిధ ప్రజా సంఘాల నాయకులు అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయనను సత్కరించారు. వివిధ సంఘాల నాయకులు గార్లపాటి దాసు, గనుపల్లి రాజశేఖర్, దుద్దుల యోహాన్, జీవన్ మాదిగ, నందిగం దేవదాసు, అధికారులు శిఖా శ్యామ్‌సన్, శివుడు, ప్రేమరాజు పాల్గొన్నారు.

రూ.50 లక్షల జడ్పీ నిధులతో అభివృద్ధి పనులు

రెంటచింతల: మాచర్ల గుంటూరు ఆర్‌అండ్‌బీ రహదారి పక్కనే ఉన్న జంక్షన్ కాలనీ అభివృద్ధికి అధికారులు రూ.50లక్షల నిధులు విడుదలచేశారు. సమస్యలపై సర్పంచ్ మండలపు హనిమిరెడ్డి టీడీపీ అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే జిల్లా పరిషత్‌లో సమస్యను ప్రస్తావించి నిధుల మంజూరుకు కృషిచేశారు. ఈ నిధులతో రహదారులు, డ్రెయినేజ్‌లను నిర్మిస్తున్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

మాచర్ల రూరల్: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి, సీపీఎం నేత బండ్ల మహేష్, ఎంసీపీఐయూ నేత మాచవరపు నాగేశ్వరరావు, మిద్దె పోగు బాబురావు, రమణ, మల్లయ్య, కొణపర్తి బ్రహ్మం, కిరణ్, చిన ఏసోబు, మంగయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై సమీక్ష

దుర్గి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు చెంచులకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఎంపీడీవో సుగుణ సోమవారం మండలంలోని రాజానగర్‌లో చెంచులతో సమీక్షించారు. గృహ నిర్మాణాలు, జీవనభృతి కోసం నిత్యావసరాలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు, పెన్షన్, సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. చెంచులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏవో శివప్రసాద్, షేక్ వలి పాల్గొన్నారు.

వరలక్ష్మణరావుకు సన్మానం

కారంపూడి: వాసవీ సేవాసమితి వ్యవస్థాపకుడు చీతిరాల గురుపెద్దన్న ఆధ్వర్యాన రాష్ట్ర మానవహక్కుల మాజీ చైర్మన్ కె. పెదపేరిరెడ్డి నుంచి సోమవారం నరసరావుపేటలో చేతి సంచులను ఆవిష్కరించారు. మాజీ సీఎం కొనిజేటి రోశయ్య నాలుగో వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కారంపూడికి చెందిన ఆర్యవైశ్యం సంఘం జిల్లా కార్యదర్శి వెచ్చా వరలక్ష్మణరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొత్తా నరసింహారావు, సూర్య వెంకటసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

విజయపురిసౌత్: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు అన్నారు. సోమవారం స్థానికంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో శివ, భూలోక, మైలపల్లి దేవుడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజే 90 శాతం పింఛన్ల పంపిణీ

● పిడుగురాళ్లలో పంపిణీ చేసిన ఎమ్మెల్యే యరపతినేని



పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నెల 1వ తేదీనే 90శాతం పింఛన్లు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆకాంక్ష మేరకు అధికారులు, కూటమినేతలు తెల్లవారు జాము నుండే పంపిణీలో పాల్గొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో 9, 10 వార్డుల్లో పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేవీ సుబ్బారావు, కమిషనర్ ఐ శ్రీనివాసులు, పిల్లి చెన్నారావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, తురకా వీరస్వామి, షేక్ బాబావలి, వున్నం ఆంజనేయులు, మందా డేవిడ్, గండికోట వెంకటేశ్వర్లు, బడిగుంచల వెంకటేశ్వర్లు, ఎల్‌వీఆర్, జొన్నలగడ్డ శ్రీను, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా పాల్గొన్నారు.

ఇంటికే సంక్షేమ పథకాలు

దాచేపల్లి: కూటమి ప్రభుత్వంలో పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకే చేరుతున్నాయని టీడీపీ సీనియర్ నాయకులు నర్రపుల్లయ్య అన్నారు.దాచేపల్లి నగర పంచాయతీ, నడికూడి గ్రామంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఇళ్ళ వద్దకు చేరుకొని పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో కూటమినేతలు పాల్గొన్నారు.

95 శాతం పింఛన్‌ల పంపిణీ

మాచవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో 95 శాతం పింఛన్‌ల పం పిణీ జరిగిందని ఎంపీడీవో విష్ణు చిరంజీవి సోమవారం తెలిపారు. మండలం మొత్తం మీద 7,279 పింఛన్‌లకు 6,690 పింఛన్‌లను పంపిణీచేశామని, మిగిలిన వారు 2వ తేదీన తీసుకోవాలని కోరారు. పింఛన్‌ల పంపిణీలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నట్లు చెప్పారు.

ఆపన్నులకు బాసటగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆపన్నులకు బాసటగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు నిలుస్తున్నాయని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ బీసీ కాలనీలో పింఛన్లను అందించి మాట్లాడారు. కారంపూడిలోని ఎన్టీఆర్ బీసీ కాలనీలో రూ.30లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆరోగ్యాంధ్రానే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మండలంలోని పెదకొదమగుండ్లలో రూ.36లక్షలతో నిర్మించనున్న పీహెచ్‌సీ భవనానికి ఆయన భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, వాణిజ్యవిభాగం రాష్ట్రకార్యదర్శి పంగులూరి పుల్ల య్య, పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరిరావు, తం డా మస్తాన్‌జాని, నాగారపు రామకృష్ణ, సర్పంచ్ సరస్వతిబాయి, గోరంట్ల నాగేశ్వరరావు, ఎస్‌పీఆర్ కృష్ణ, ఉన్నం లక్ష్మీనారాయణ, చప్పిడి రాము, బొ ల్నేడి శ్రీనివాసరావు, తోట అల్లయ్య, జనసేన మాచర్ల నియోజకవర్గ కన్వీనర్ బూసా రామాంజినేయులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి హనుమంతురావు, కోశాధికారి కజ్జం పెదఆంజనేయులు, షేక్ నన్నేసా, గాడిపర్తి పూర్ణయ్య, కటికల బాలకృష్ణ, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ వాసు పాల్గొన్నారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

కారంపూడి: అన్ని ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఒప్పిచర్లలో రూ.70లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన జరిపారు. అనంతరం జడ్పీ హైస్కూల్‌లో రూ.56.79 లక్షలతో నిర్మించిన ఆరు తరగతి గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

91 శాతం పింఛన్ల పంపిణీ

రెంటచింతల: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సోమవారం వేకువజామునుంచే పంచడం ప్రారంభించారు. పెన్షన్ల పంపిణీకి ఇన్‌చార్జిలుగా పలువురు అధికారులను నియమించారు. ఆయా గ్రామాల్లోని టీడీపీ నేతలు సర్పంచ్ లు, ఎంపీడీవో కె.స్వరూపరాణి, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పర్యవేక్షించారు. రెంటచింతలలో టీడీపీ నేత సుమంత్‌రెడ్డి, సొసైటీ



పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

చైర్మన్ అల్లం నాగలక్ష్మీ, రామకృష్ణ,రాజ్‌కుమార్, రాజారెడ్డి, మారాజు శ్రీను, అప్పయ్య 91శాతం మందికి పింఛన్లు అందచేశారు.

● దుర్గి: దుర్గి మండలంలో సోమవారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని కూటమి నేతలు నిర్వహించారు. 89శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో సుగుణ, ఈవోపీఆర్డీ రాజు వెల్లడించారు. దుర్గిలోని ఇందిరమ్మ కాలనీలో ఏపీ ఎస్సీ కమిషన్ సభ్యుడు మేకల భీక్షం పెన్షన్ అందించారు. సచివాలయ ఉద్యోగులు, సర్వేయర్లు, వీఆర్వోలు వార్డుల్లో పెన్షన్లు పంపిణీ చేశారు.

45రోజులలో హైలెవల్ వంతెన నిర్మాణం పూర్తి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదమద్దూరు వాగువద్ద నిర్మాణంలో ఉన్న వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): 45రోజులలో పెదమద్దూరు వాగుపై నూతనంగా నిర్మిస్తున్న హైలెవల్ వంతెననిర్మాణం పూర్తిచేయనున్నట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం మండలంలోని పెదమద్దూరులో నిర్వహించిన ప్రజల వద్దకు ప్రవీణ్ కార్యక్రమంలో ముందుగా గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం గ్రామంలో పెన్షన్‌లను లబ్దిదారులకు పంపిణీ చేసి నిర్మాణంలో ఉన్న హైలెవల్ వంతెనను పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం జరిగిన గ్రామసభలో ప్రజల నుండి సమస్యలపై 16 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జాస్తి వీరాంజనేయులు, తహసీల్దార్ డానియోలు, ఎంపీడీఓ పార్వతి, ఎంఈఓ ప్రసాద్, ఏఓ అహ్మద్, ట్రాన్స్‌కో ఏఈ రవికిరణ్, పెదమద్దూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ బీ సూర్యనారాయణ, పి.శ్రీనివాస్, పి.అనిల్, పి.సాంబశివరావు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పండుగలా పింఛన్‌ల పంపిణీ

బెల్లంకొండ: పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం బెల్లంకొండ మండలంలో పండుగలా చేపట్టారు. కందిపాడులో టీడీపీ నేత నల్లమేకల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో చేపట్టారు. బెల్లంకొండలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి మస్తాన్‌షరీఫ్, పీఎస్‌కే రసూల్, సుభానీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్ళి పింఛన్‌లు పంపిణీచేశారు. నాగిరెడ్డిపాలెంలో మండల కోర్ కమిటీసభ్యులు వెన్నా సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో సచివాలయసిబ్బంది పంపిణీ చేశారు.

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

క్రోసూరు: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్‌లు కాంద్రు కాశయ్య, డాక్టర్ మహమ్మద్ షరీఫ్ అన్నారు. క్రోసూరులో పింఛన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నె శ్రీ నివాసరావు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ దుద్దుల యో హాన్, అనుమాల పూర్ణ, అనుముల వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. 94శాతం సోమవారం పంపిణీ చేసినట్టు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు.

● అచ్చంపేట: అచ్చంపేట రాజీవ్‌నగర్‌లో నాయకులు, అధికారులు పింఛన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ రాయుడు సాంబశివుడు, ఎనిగండ్ల కోటయ్య, ఎస్‌కే కాసుల, తిరువాయిపాటి ఆంజనేయులు, సంపంగుల రాంబాబు, వెంకట ప్రసాదు, కోట చంటి తదితరులు పాల్గొన్నారు.

● పెదకూరపాడు: ఒకటో తేదీనే కూటమి ప్రభుత్వం పింఛన్‌లను పంపిణీ చేస్తుందని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. గారపాడులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు మక్కెన సాగర్, టీడీపీ మండల నాయకులు పెనుముచ్చు రమేష్, మేడా రమణ, పి.కోటేశ్వరరావు, పి.కరుణాకర్ పాల్గొన్నారు. బుచ్చయ్యపాలెం, పెదకూరపాడులోనూ పింఛన్లు పంపిణీ చేశారు.

ఎయిడ్స్ మహమ్మారిని పారదోలాలి

● కళాశాల ప్రిన్సిపాల్ కవిత



బెల్లంకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ కళాశాల విద్యార్థులు

బెల్లంకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ మహమ్మారిని ప్రపంచం నుంచి పారదోలాలంటే నివారణ ఒక్కటే మార్గమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కవిత పేర్కొన్నారు. సోమవారం బెల్లంకొండ కళాశాల విద్యార్థులచే ఎయిడ్స్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ విద్యార్థులు, ప్రజలు ఎయిడ్స్ వ్యాధి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి లక్ష్మీ సులోచన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల: పట్టణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక స్కాలర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో పిడుగురాళ్ల పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణ ప్రధానరహదారుల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పట్టణ ప్రముఖ వైద్యుడు కేవీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కలిగివుండాలన్నారు. కార్యక్రమంలో స్కాలర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు జి.శ్రీనివాసరెడ్డి, ఎం జగదీష్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు ఆ వుల జనార్ధనరావు, జోన్ చైర్మన్ టంగుటూరి వెంకటసతీష్, యడవల్లి ఏడుకొండలు, వెంకటస్వామి, కొత్త కాశీవిశ్వనాథం, గుండా రమేష్, డీకొండ వెంకటస్వామి, కొత్త సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● క్రోసూరు: ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని ఎర్రబాలెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్‌సన్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాప్తికి కారణాలు, వాటి లక్షణాలు, నివారణ మార్గాల గురించి వివరించారు. ర్యాలీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రజిని, ధనలక్ష్మీ, మల్లిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

● గురజాల ఆర్డీవో మురళీకృష్ణ



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో మురళీకృష్ణ

పిడుగురాళ్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు సంబంధించి భూసమస్యలను ఎప్పటికప్పుడు తగ్గించేలా రెవెన్యూ అధికారులు దృష్టి సారించాలని గురజాల ఆర్డీవో వీ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడుతూ రైతులకు సంబంధించి ఆన్‌లైన్ నమోదు, ఎఫ్ లైన్ పిటీషన్‌లు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆర్డీవో సూచించారు. సమావేశంలో తహసీల్దార్ మధుబాబు, డీటీ సుధాకర్ శర్మ, ఆర్‌ఐ శ్రీనివాసబాబు, సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.


సఖి సురక్ష కార్యక్రమం

మాచర్ల రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురపాలకసంఘ కార్యాలయంలోని మెప్మా కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు ఆధ్వర్యాన సఖి సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని డ్వాక్రా సంఘాలకు చెందిన 35 సంవత్సరాలు నిండిన మహిళలకు ఉచిత హెల్త్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అర్హులైన మహిళలకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు కూడా జారీ చేస్తారన్నారు. పట్టణ డ్వాక్రా సంఘాల మహిళలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మెప్మా కార్యాలయంలో నిర్వహిస్తున్న సఖి సురక్ష కార్యక్రమం

కుడికాలువలో వ్యక్తి గల్లంతు



సీతారామయ్య (ఫైల్‌ఫోటో)

విజయపురిసౌత్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాలువలో ప్రమాదవశాత్తూ వ్యక్తి గల్లంతైన సంఘటన సోమవారం జరిగింది. మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన కుక్కడాల సీతారామయ్య (50) దత్తాత్రేయ స్వామి మాల ధరించారు. సోమవారం వేకువజామున గ్రామ సమీపంలోని కుడికాలువలో స్నానం చేసేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తూ ప్రవాహంలో కొట్టుకుపోయారు. స్థానికులు విజయపురిసౌత్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు కుడి కాలువలో గాలింపు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు.

నబీసా కుటుంబసభ్యులకు పరామర్శ

మాచర్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పదో వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త నబీసా అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి మట్టి ఖర్చులకు ఆర్థికసాయం అందించారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీల పోస్టర్ ఆవిష్కరణ

గురజాలటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గురజాలలోని శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీల పోస్టర్‌ను సోమవారం నాగార్జున సాగర్ కుడి కాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు ఆవిష్కరించారు. ముందుగా పోటీలు జరుగు స్థలాన్ని కాంతారావు కూటమి నేతలతో కలిసి పరిశీలించారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, రైతు సంఘం ఆధ్వర్యాన 32వ వార్షికోత్సవ ఎడ్ల బండ లాగుడు పోటీలు ఈనెల 5వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. సీనియర్, జూనియర్, న్యూకేటగిరి, నాలుగు పళ్ల, ఆరు పళ్ల విభాగంలో పోటీలు ఉంటాయని కమిటి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో యాగంటి రామారావు, పొత్తూరి శివనాగు, మద్దినేని లక్ష్మీనారాయణ, పోటు నాగేశ్వరరావు, యేచూరి సతీష్, నవులూరి శ్రీరామ్మూర్తి, నల్ల లక్ష్మయ్య, తన్నీటి బుచ్చిబాబు, నెల్లూరి మల్లయ్య, పోటు విశ్వనాథం, చలవాది శ్రీనివాస్, షేక్ నాగుల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా కె.స్వరూపరాణి

రెంటచింతల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా కె.స్వరూపరాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె నాదెండ్ల మండలం నుంచి పదోన్నతి పొంది బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన సీహెచ్ శ్రీనివాసరావు నాదెండ్లకు వెళ్లారు.

గృహాలకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగింపు

రెంటచింతల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పీఎం ఏవై కింద ప్రభుత్వ గృహాలకు దరఖాస్తు చేసుకోవడానికి రెండు వారాలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు హౌసింగ్ ఏఈ సీ శ్రీనివాస్ చెప్పారు. ఈనెల 14 దాకా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

వృద్ధులు తలెత్తుకొనేలా చేసిన కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



శ్రీనాగన్నకుంటలో పింఛన్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కూటమి నేతలు

సత్తెనపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వృద్ధులు తలెత్తుకొనేలా కూటమి ప్రభుత్వం చేసిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని నాగన్నకుంటలో ఇంటింటికి తిరిగి వృద్ధులకు, దివ్యాంగులకు, ఇతర అర్హులందరికీ కన్నా పింఛన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అత్యధికంగా పింఛన్‌లు అందిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నా రు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, దరువూరి నాగేశ్వరరావు, కోమటినేని శోభారాణి, రంగిశెట్టి సుమన్, రాడ్ల శ్రీనివాసరావు, కట్టా శంకరరావు, బోడెంపూడి రాజేశ్వరి, మస్తాన్‌వలి, నూర్ బాషాజానీబాబు తదితర కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

9,760 మందికి పింఛన్‌లు పంపిణీ

సత్తెనపల్లి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. సచివాలయ సిబ్బంది ఉదయం 6గంటలకే లబ్దిదారుల గృహాలకు వెళ్ళి పింఛన్‌లను పంపిణీ చేశారు. మండలంలో 10,549 పింఛన్‌లు ఉండగా 9,760 మందికి పంపిణీ చేసినట్టు ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పంపిణీలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్‌ల పంపిణీతో లబ్ధిదారుల్లో ఆనందం

నకరికల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 1వ తేదీనే పింఛన్ పంపిణీ చేయటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎంపీడీవో జీ కాశయ్య అన్నారు. మండలంలో సోమవారం సాయంత్రానికి 90 శాతానికి పైగా పింఛన్‌లు పంపిణీ చేసినట్టు తెలిపారు. నకరికల్లు, చల్లగుండ్లలో పింఛన్‌ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. పింఛన్‌ల పంపిణీని ఆయన సచివాలయ ఉద్యోగులతో సమీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ప్రసాదు, షేక్ కరిముల్లా, ఈసీ ఎస్ కృష్ణకుమారి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆటోనగర్ సమస్యలను పరిష్కరిస్తా...

సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణంలోని ఆటో నగర్ వాసుల సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ఆటోనగర్‌లో మిత్ర ఆటోవర్కర్ యూనియన్ రెండో వార్షికోత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని గతంలోనే సీఎం చంద్రబాబును కోరామన్నారు. కార్యక్రమంలో చౌట శ్రీనివాసరావు, దరువూరి నాగేశ్వరరావు, మొక్కపాటి రామచంద్రరరావు, మస్తాన్ వలి, నూర్ బాషా జానీ బాబు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

● రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు



టీడీపీ ముఖ్య నేతలతో మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

సత్తెనపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పట్టణంలోని ఎస్సీలకు చెందిన నాలుగు వార్డుల్లో ప్రభుత్వ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్, ఎస్సీ వార్డుల ప్రత్యేక పరిశీలకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. సోమవారం రాత్రి 16వ వార్డులో టీడీపీ ముఖ్య నేతలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మునిసిపల్ ఎన్నికల్లో నాలుగు వార్డుల్లో టీడీపీ మెజార్టీ సాధించాలన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని నాయకులకు సూచించారు. ఆయనతో పాటు నాయకులు బలిజేపల్లి సురేష్ కుమార్, బండారు నాగరాజు, కంభంపాటి అబ్రహం, చుక్కపల్లి శ్రీను తదితరులు ఉన్నారు.

నీరు కలుషితంపై పరిశీలన



కలుషితమైన నీటిని పరిశీలిస్తున్న తహశీల్దార్ శ్రీనివాస్

దాచేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కలుషితమైన కృష్ణానది నీటిని దాచేపల్లి తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్ సోమవారం పరిశీలించారు. తంగెడ గ్రామ సమీపంలోని కృష్ణానదిలో నీరు కలుషిత కావడంపై అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కృష్ణానది ఒడ్డున ఉన్న సిమెంట్ పరిశ్రమలు, కృష్ణానదిలో కలుస్తున్న ఉపనదులు, పరివాహక ప్రాంతాల నుంచి కలుషిత నీరు కృష్ణానదిలో కలుస్తున్నాయా.., ఇతర కారణాలపై అధికారులు వివరాలు సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేసి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు.

ఎస్సీ కాంప్లెక్స్ గదికి సీలు వేసిన అధికారులు

క్రోసూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వివాదాల నేపథ్యంలో క్రోసూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఎస్సీ కాంప్లెక్స్ రూమ్ నెం.2కు సోమవారం అధికారులు సీలు వేశారు. ఈ గది క్రోసూరు ఎస్సీ కాలనీకి చెందిన కిషోర్‌కి కేటాయించారు. ఆయన మరణించటంతో ఆయన భార్య మెరీనా తన వారసులకు గదిని కేటాయించాలని అధికారులకు దరఖాస్తు చేసుకుంది. ఈ క్రమంలో కొంతమంది వ్యక్తులు గదిని స్వాధీనం చేసుకొని బయట వ్యక్తులకు హోటల్‌కు అద్దెకు ఇచ్చారు. ఈ క్రమంలో మెరీన అధికారులకు దరఖాస్తులు చేయటంతో ఎస్సీ కార్పొరేషన్ అధికారి లూకాస్ సోమవారం విచారణ జరిపారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో రవికుమార్, ఇతర అధికారుల సమక్షంలో గదిలో అద్దెకు ఉన్నవారిని ఖాళీ చేయించి స్వాధీనం చేసుకొని సీలు వేశారు.

తెలుగు మహిళా అధ్యక్షురాలిగా నిర్మల

పిడుగురాళ్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలిగా తాళ్ల నిర్మల ఎంపికయ్యారు. పట్టణ పార్టీ కార్యాలయంలో నిర్మలను తెలుగు మహిళలు చల్లగుండ్ల సీత, బొల్లా పద్మ, కొంకా రాధ, దియ్యా విజయ, చల్లా అంజమ్మ, అల్లూరి సామ్రాజ్యం, గంగ, వీరమహిళ రమణ, బీజేపీ నాయకురాలు అరుంధతి తదితరులు సత్కరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ తురకా వీరస్వామి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, వడ్డవల్లి సాంబశివరావు, పిల్లి చెన్నారావు, పలువురు నేతలు నిర్మలకు అభినందనలు తెలిపారు.

కొత్త చట్టాలపై విద్యార్థులకు అవగాహన: డీఎస్పీ

కొత్త చట్టాలపై ప్రతిఒక్కరు అవగాహన కలిగివుండాలని గురజాల డీఎస్పీ జగదీష్ తెలిపారు. సోమవారం స్థానిక తిరుమల ఆక్స్‌ఫర్డ్ కళాశాలలో విద్యార్థులకు కొత్త చట్టాలు, డ్రగ్స్ వద్దు బ్రో..పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ గురించి సమాచారం వుంటే ఉన్నతాధికారులకు తెలపాలని, మత్తు పదార్థాలకు అలవాటుపడితే జీవితం నాశనమవుతుందన్నారు. సదస్సులో ఎస్‌ఐ శివనాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

దిత్వా తుఫాన్ ప్రభావంతో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని మార్కెటింగ్‌శాఖ సిబ్బంది గ్రామాలలో అవగాహన కల్పించారు. సోమవారం పలు గ్రామాలలో మార్కెటింగ్, వ్యవసాయశాఖ సిబ్బంది కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. వరికోతలు మరో వారంరోజులపాటు వాయిదా వేసుకోవాలని జీడీసీసీ బ్రాంచి ఇన్‌చార్జ్ షేక్ యూసుబు రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని ఐదు క్లస్టర్స్‌లోగల ఆర్‌ఎస్‌కేల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించామని తెలిపారు.

5న మెగా పీటీఎం 3.0

● అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో నిర్వహణ ● తల్లిదండ్రులతో పిల్లల ప్రగతిపై చర్చ



నరసరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం) 3.0 కార్యక్ర మాన్ని డిసెంబరు 5న నిర్వహించనున్నారు. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూల్స్ కేజీబీవీ, గిరిజన, సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లో పీటీఎం జరగనుంది. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రభుత్వ విద్యాసంస్థలో తల్లిదండ్రులకు భాగస్వామ్యం కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్ పర్సన్లు, సభ్యులు, అధికారులు అందరూ పాల్గొంటారు.

● పిల్లల ప్రగతిపై చర్చ

పీటీఎంలో పిల్లల ప్రగతిపై చర్చ జరుగుతుంది. ప్రతి ఒక్క స్కూల్లో పిల్లల అకడమిక్ అభివృద్ధి, గత కొన్ని నెలల్లో వారు స్కూల్లో నేర్చుకున్న అకడమిక్స్ వివరాలు, వారి ప్రోగ్రెస్ కార్డ్, మార్కులు తల్లిదండ్రులతో చర్చిస్తారు. ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) సభ్యులు తల్లిదండ్రులతో కలిసి స్కూల్ అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చిస్తారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఒక్కొక్క స్కూల్‌కు హాజరు కావాలని, అందుకు సంబంధించిన మ్యాపింగ్ కూడా జరుగుతుందని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడానికి, విద్యార్థుల విద్యా స్థాయిపై తల్లిదండ్రులకు అవగాహనకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. పీటీఎంను ఒక పండుగ వాతావరణంలో, సమగ్ర విద్యా అభివృద్ధికి దోహదపడే విధంగా నిర్వహించనున్నామన్నారు.

● హోలీస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టుల అందజేత

ఈ కార్యక్రమంలో విద్యార్థుల హోలీస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేస్తారు. చిన్న పిల్లలకు చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి వాటిపై అవగాహన ఉందా లేదా అనే అంశాలు తల్లిదండ్రులతో చర్చిస్తారు. తదుపరి మూడు నెలల క్యాంపెయిన్ కింద ఎఫ్ఎల్ఎన్ లెర్నింగ్‌ను ముందుకు తీసుకెళ్లే కార్యాచరణ కూడా వివరిస్తారు. డిసెంబరు 5 నాటికి 10వ తరగతి సిలబస్ చాలా వరకు పూర్తవుతుంది. ఆ తర్వాత 100 రోజుల ఇంటెన్సివ్ యాక్షన్ ప్లాన్ గురించి తల్లిదండ్రులతో చర్చిస్తారు. విద్యార్థులు ఆరోగ్య స్థితిగతులపై తల్లిదండ్రులకు తెలియజేస్తారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుంది. అనంతరం విద్యార్థులు వారి తల్లిదండ్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి డొక్కా సీతమ్మ భోజన కార్యక్రమంలో సహపంక్తి భోజనాన్ని చేయనున్నారు. ప్రతి ఒక్క తల్లిదండ్రి తమ పిల్లలతో పాటు ఈ మెగా పీటీఎంకు తప్పకుండా హాజరు కావాలని, అప్పుడే వారికి తమ పిల్లల ప్రోగ్రెస్ గురించి అవగాహన కలుగుతుందని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.



ఇళ్లులేని గ్రామీణ పేదలకు గృహ నిర్మాణ సహాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. గత నెల 30వ తేదీతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) గ్రామీణ పథకం గడువు ముగిసినప్పటికీ ఆ గడువును మరో 14 రోజులు అదనంగా పెంచింది. దీంతో అర్హులైన పేదలకు గృహ నిర్మాణ సహాయం పొందేందుకు మరో అవకాశం లభించినట్లయింది.

పీఎంఏవై గడువు పొడిగింపు

● మరో 14 రోజులు పొడిగించిన ప్రభుత్వం
● సచివాలయ సిబ్బందితో విస్తృత స్థాయిలో సర్వే
● అర్హులైన ప్రతి ఒక్కరినీ జాబితాలో చేర్చడమే లక్ష్యం

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని పేదలను గుర్తించి వారిని పీఎంఏవై పరిధిలోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గుంటూరు జిల్లాలో 15 వేల మంది, బాపట్ల జిల్లాలో 25 వేల మంది, పల్నాడు జిల్లాలో 50 వేల మంది ఈ పథకం పరిధిలోకి వస్తారని గృహనిర్మాణ శాఖ అధికారులు అంచనా వేశారు. పీఎంఏవై 2025 గ్రామీణ పథకం 2028-29 వరకూ అమలు కానున్న నేపథ్యంలో ఆలోపు మళ్లీ గృహ రుణాలకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేదు. అందువల్ల ఇప్పుడే వీరందరినీ ఈ పథకం పరిధిలోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే ఈ ప్రక్రియ పూర్తికాలేదు. నవంబరు నెలాఖరునాటికి గుంటూరు జిల్లాలో 10వేలు, బాపట్ల జిల్లాలో 18,500, పల్నాడు జిల్లాలో 25వేల మందికి పైగా పీఎంఏవై గ్రామీణ పథకం పరిధిలోకి వచ్చారు. మిగిలినవారిని కూడా ఈ పరిధిలోకి తీసుకురావాలనే లక్ష్యంతో అధికారులు చర్యలు చేపట్టారు.

● సచివాలయ సిబ్బందితో సర్వే..

ఇళ్లు లేని గ్రామీణ ప్రాంత పేదలు భారీ సంఖ్యలో ఉన్నప్పటికీ వారిలో మెజారిటీ ప్రజలకు స్థలం లేదు. అలాంటివారిని కూడా పథకం పరిధిలోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సచివాలయ ఉద్యోగులతో సర్వే చేపట్టి, ఇంటి స్థలం లేనివారితో కూడా పీఎంఏవై పథకానికి దరఖాస్తు చేసుకునేలా చేసింది. అయితే ఈ ప్రక్రియ నవంబరు నెలాఖరు నాటికి పూర్తి కాకపోవడంతో మరో 14 రోజులు గడవును పొడిగించింది. అర్హులను గుర్తించి, వారిని తక్షణం పీఎంఏవైకి దరఖాస్తు చేసుకునేలా సచివాలయ ఉద్యోగులను పరుగులు పెట్టిస్తోంది.

● గృహ రుణ సదుపాయం ఇలా..

పీఎంఏవై పథకం కింద లబ్ధిదారులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.2,50,000 రుణం అందజేస్తున్నాయి. ఇందులో కేంద్రం వాటా రూ. 1.50 లక్షలు కాగా రాష్ట్రం వాటా రూ.లక్షగా ఉంటుంది. దీన్ని నాలుగు దశల్లో అందజేస్తారు. దీంతోపాటు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కన్వర్జెన్స్ కింద 90 రోజుల కూలీ, టాయిలెట్ నిర్మాణం కోసం ఇచ్చే రూ. 12వేలు కలిపి మొత్తం 39 వేలు అదనంగా ఇవ్వనున్నారు. స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకోవడానికిపైన ప్రకటించిన ఆర్థిక సహాయం అందజేస్తారు. ఇంటి స్థలం లేనివారికి 3 సెంట్ల స్థలాన్ని కేటాయించి ఇల్లు నిర్మించుకునేందుకు సహాయం అందజేస్తారు.

● ఆర్థిక సహాయం ఇలా..

నిర్మాణ దశ	నిధుల విడుదల
పునాది దశ	రూ. 60,000
గోడల దశ	రూ. 60,000
స్లాబ్ దశ	రూ. 60,000
తుది దశ	రూ. 70,000
మొత్తం	రూ.2,50,000

● కావాల్సిన పత్రాలు..

ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆధార్ లింకైన బ్యాంకు పాస్‌బుక్, స్థలం ఉంటే భూమి పట్టా, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫోటోలు, మొబైల్ నెంబరు.

షట్‌డౌన్..!

● తుఫాన్ ప్రభావాల పేరిట బీచ్‌ల మూసివేత
● సన్నద్ధత ఉండాలే గాని... నిషేధం ఏంటనే ప్రశ్నలు
● పర్యాటకరంగంపై తీవ్ర ప్రభావం
● వందల మంది ఉపాధిపై పరోక్షంగా దెబ్బ

● వరుస ప్రమాదాలతో భయాందోళన
● స్త్రీ శక్తి పథకంతో మరింత పెరిగిన రద్దీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
తుఫాన్ హెచ్చరికలు రాగానే తొలి వేటు పర్యాటకంపైనే పడుతోంది. ఇటీవల విరుచుకుపడిన మొంథా తుఫాన్ కానీ, ప్రస్తుతం దిత్వా విషయంలో కానీ జరుగుతున్నది ఇదే. అప్రమత్తం పేరిట ఏకంగా తీరప్రాంతంలో పర్యాటకులకు అనుమతి లేదనే ఆదేశాలు జారీ చేయడం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ముఖ్యంగా సన్నద్ధతకు, నిషేధానికి మధ్య ఉన్న తేడాను గుర్తించడంలో యంత్రాంగం గాడి తప్పుతోందన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

● మరో గోవాగా విరాజిల్లడానికి అవకాశం

జిల్లాలో సుదూర తీర ప్రాంతం ఉంది. పర్యాటకంగా మరో గోవాగా విరాజిల్లడానికి బాపట్ల జిల్లాకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే వారాంతాల్లో బాపట్ల, చీరాల బీచ్‌లకు వేల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. కొంచెం ప్రభుత్వం వైపు నుంచి ప్రోత్సాహం ఇస్తే పర్యాటక రంగంలో గణనీయంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు జిల్లా అభివృద్ధికి టూరిజం గ్రోత్ ఇంజన్‌లా ఉపయోగపడనుందని పాలకులు పలు వేదికలపై ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులతో సంబంధం లేకుండా బీచ్‌ల విషయంలో అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు విమర్శలకు దారి తీస్తున్నాయి.

● కీలకమైన కార్తికమాసంలో...

జిల్లాలో ఉన్న సూర్యలంక, రామాపురం, ఓడరేవు బీచ్‌లకు పవిత్ర కార్తికమాసంలో లక్షల సంఖ్యలో భక్తులు, పర్యాటకులు పోటెత్తుతుంటారు. అదే సమయంలో మొంథా విరుచుకుపడిన సంగతి తెలిసిందే. తుఫాన్ ప్రభావం తగ్గిపోయిన తర్వాత వారం రోజుల వరకు కూడా జిల్లాలో బీచ్‌లు మూసివేసే ఉన్నాయి. తుఫాన్ ప్రభావంతో సముద్రంలో గోతులు ఏర్పడ్డాయని, పర్యాటకులకు అనుమతిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అప్పుడు అధికారులు చెప్పారు. సాంకేతికంగా ఇందులో వాస్తవం ఉన్నా, తగు జాగ్రత్తలతో కనీసం జల్లు స్నానాలకు అయినా అనుమతిస్తే పవిత్రమైన కార్తికపౌర్ణమి తీరంలో వైభవంగా జరిగి ఉండేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది. ఇప్పుడు తాజాగా దిత్వా ప్రభావంతో ఓ వైపు చిరుజల్లులు మాత్రమే ఆది, సోమవారాల్లో జిల్లా వ్యాప్తంగా కురిశాయి. కానీ ముందస్తు జాగ్రత్తల పేరిట తీరప్రాంతంలో పర్యాటకులకు అనుమతి లేదనే నిర్ణయం తీసుకున్నారు



● ఆ స్థాయి తీవ్రత లేకుండానే..

పర్యాటకుల భద్రతకే తొలి ప్రయారిటీ. ఇందులో రెండో అభిప్రాయానికి అవకాశం ఉండకూడదు. కానీ ఆ స్థాయి తీవ్రత లేకుండానే ఏకంగా రోజుల తరబడి బీచ్‌ల మూసివేత నిర్ణయాలు తీసుకోవడమే తప్పుబట్టేదిగా ఉంది. తుఫాన్‌లు జిల్లా పరిధిలో తీరం దాటడం సందర్భాలు మినహాయిస్తే మిగిలిన వేళల్లో ఎక్కువ శాతం భారీ వర్షాలకే ఆస్కారం ఉంటుంది. ఒక వేళ అంచనాలకు మించి వర్షాలు కరిస్తేనో లేక ఈదురుగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటేనో నాలుగైదు గంటల ముందు ఆ తీవ్రతను బట్టి బీచ్‌లు ఖాళీ చేయించే సన్నద్ధత మన వ్యవస్థలకు లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. తుఫాన్ ప్రభావం అనగానే పర్యాటకుల ప్రవేశంపై నిషేధం విధిస్తే మేలనే అభిప్రాయానికి రావడం అంటే ఓ విధంగా బాధ్యతల నుంచి తప్పుకోవడమేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి

● ఇలా అయితే పర్యాటకం కష్టమే...

ఏడాదిలో పదుల సంఖ్యలో తుఫాన్‌లు జిల్లాను పలకరిస్తుంటాయి. కొన్ని తీవ్రతతో, మరికొన్ని నామమాత్రంగా ప్రభావం చూపుతుంటాయి. ప్రతిసారీ బీచ్‌ల మూసివేత నిర్ణయం తీసుకుంటే పర్యాటకం అభివృద్ధితో పాటు స్థానికంగా వందల మంది ఉపాధిపై దెబ్బ పడుతోంది. తీర ప్రాంతంలో భద్రతా ప్రమాణాలను మరింతగా పెంచే చర్యలపై దృష్టి పెట్టాలి అంతే కానీ ముందస్తు జాగ్రత్తల పేరిట తీరప్రాంతాన్ని మూసివేయడం సరికాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

(5వ పేజీ తరువాయి)
చెల్లించాలి. ఒక్క గుంటూరు కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి రూ.25.03 కోట్లు బకాయిలున్నాయి. గుంటూరులో ప్రభుత్వ కళాశాలకు సంబంధించి రూ.2.98 కోట్లు ఆస్తి పన్ను బకాయి 2019 నుంచి చెల్లించాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయం నుంచి రూ.1.73 కోట్లు 1993 నుంచి బకాయి ఉంది. తెనాలి మునిసిపాల్టీలో రూ.1.98 కోట్లు, మంగళగిరి - తాడేపల్లిలో రూ.1.42 కోట్లు, పొన్నూరు మునిసిపాల్టీలో రూ.60 లక్షలు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

బకాయి భారం


కోర్టు కేసుల్లో ఆస్తి పన్ను వివాదాలు

ఆస్తి పన్ను విధించడంలో లోపాలను సవరించాలని భవన యజమానులను కోర్టులను ఆశ్రయించారు. దీంతో ఆయా భవనాలకు సంబంధించి పన్ను వసూలు నిలిచిపోయింది. పిటిషన్ దారులు పేర్కొన్న అంశాలను పరిష్కరించి కోర్టులో కేసులు ఉపసంహరించు కొనే దిశగా అధికారుల చర్యలు లేవు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే కేసుల సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంది. ఈ దిశగా ఆధికారులు చర్యలు చేపడితే పెద్ద ఎత్తున పన్ను వసూలు అయ్యే అవకాశాలు ఉన్నాయి. మూడు జిల్లాల్లో రూ.19.02 కోట్లు కోర్టు వివాదాల వల్ల పన్ను బకాయిలు పేరుకుపోయాయి. గుంటూరు జిల్లాలోని కార్పొరేషన్‌తో సహా మునిసిపాల్టీల్లో రూ 7.52 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ 9.73 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ 1.77 కోట్లు బకాయిలు ఉన్నాయి. తెనాలి మునిసిపాల్టీలో 31 కేసుల వల్ల రూ.2.98 కోట్లు పన్ను వసూలు నిలిచిపోయింది. గుంటూరు కార్పొరేషన్‌లో 66 కేసులు కోర్టుల్లో ఉన్నాయి. చిలకలూరిపేట మునిసిపాల్టీలో రూ.9.58 కోట్లు కోర్టు వివాదాల వల్ల బకాయిలు ఉన్నాయి. 6,045 అసెస్‌మెంట్‌లకు సంబంధించి కోర్టులలో పిటిషన్‌లు దాఖలయ్యాయి. కోర్టులో ఉన్న కేసులను పరిష్కరించుకొని ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేయడంతో అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

డిసెంబరు 20న శ్రీనివాసుని కల్యాణం

పిడుగురాళ్లలో స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన శ్రీనివాసుని కల్యాణం పిడుగురాళ్లలో నిర్వహించనున్నామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం టీటీడీకి చెందిన మల్లికార్జునరావు, మరికొంత మంది అధికారులతో కలిసి ఎమ్మెల్యే యరపతినేని స్థానిక జడ్పీ హైస్కూల్, కన్యకాపరమేశ్వరి దేవాలయం ముందు ఉన్న ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే యరపతినేని విలేకరులతో మాట్లాడుతూ, 2014-19 మధ్య కాలంలో పిడుగురాళ్లలోని జడ్పీ స్కూల్‌లో ఒకసారి శ్రీనివాసుని కల్యాణం నిర్వహించామని, ఇప్పుడు రెండోసారి జరుపనున్నామన్నారు. అనంతరం గురజాల పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల పత్రికలను ఎమ్మెల్యే యరపతినేని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో గురజాల డీఎస్పీ జగదీష్, మున్సిపల్ చైర్మన్ కెవి.సుబ్బారావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, యేలూరి చంద్రశేఖర్, కనిగిరి శ్రీను, కొత్త రఘురామయ్య, పాండురంగ శ్రీను, జూలకంటి సుబ్రహ్మణ్యం, పసుమర్తి సుబ్రహ్మణ్యం, గుండా రామారావు, లఘువరపు రామనాథం, కొత్త శివయ్య, యేలూరి శశికుమార్, కొలిశెట్టి సుబ్బారావు, కొత్తూరి ఆంజనేయులు, చందోలు రామకృష్ణారావు, వివి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

బస్టాండ్‌లో...అటో..ఇటో..ఎటో...

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బస్టాండ్‌లలో ప్రయాణికుల రాకపోకలు గందరగోళంగా మారాయి. ప్రయాణికులు ఎటు వెళుతున్నారో.. ఎటు నుంచి ఏ బస్సు వస్తుందో, ఏం ప్రమాదం జరుగుతుందో అనే పరిస్థితులు నెలకొన్నాయి. కనీస సూచికలు లేకపోవటంతో పాటు ప్రయాణికుల రద్దీ పెరగడంతో ఈ పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల గుంటూరు బస్టాండ్‌లో ఓ మహిళ బస్సు కింద పడి మృతి చెందగా.. తాజాగా ఓ విద్యార్థినిని విజయవాడ సెక్టార్‌లో బస్సు ఢీ కొంది. ఈ పరిస్థితులలో ఎటు నుంచి ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే బస్టాండ్‌లపై అధికారుల అలసత్వం, కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వెరసి ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చాక బస్టాండ్‌లలో రద్దీ రెట్టింపయింది. ఇక పండగలు, ఆదివారం వంటి సెలవు దినాల్లో రద్దీ మరింత అధికంగా ఉంటోంది.

● బస్సులో సీటు కోసం పాట్లు

స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చాక మహిళల రద్దీ బాగా పెరిగింది. మహిళలు 80 శాతం ఉంటే పురుషులు 20 శాతం వరకు ఉంటున్నారని సిబ్బంది చెబుతున్నారు. బస్టాండ్‌లలో ప్లాట్‌ఫాం వరకు బస్సు రాకముందే సీటు కోసం ప్రయాణికులు బస్సుకు ఎదురెళ్తున్నారు. ఆ సమయంలో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని డ్రైవర్‌లు, కండక్టర్‌లు ఆందోళన చెందుతున్నారు. కనీసం ప్రయాణికులను అదుపు చేసేందుకు బస్టాండ్‌లో కంట్రోలర్స్ కొరత ఉందని చెబుతున్నారు. గతంలో ఉన్న హోంగార్డులను తొలగించారు. దాంతో బస్టాండ్‌లలో పరిస్థితులను అదుపు చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఇక ప్రైవేటు వాహనాలు కూడా హల్‌చల్ చేస్తున్నాయి. బస్టాండ్‌లలో ప్రయాణికుల రద్దీ అదుపు చేయటంతో పాటు మౌలిక వసతులపై ప్రజా రవాణాధికారులు దృష్టిసారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్సుల్లో సీట్ల కోసం పోటీపడుతున్న ప్రయాణికులు



బస్టాండ్ ప్రాంగణంలో గందరగోళంగా ప్రయాణికుల రాకపోకలు

విద్యార్థులు మస్క్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఏఎన్‌యూ వీసీ ఆచార్య గంగాధరరావు

ఏఎన్‌యూ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు టెస్లా ఫౌండర్ ఎలాన్ మస్క్‌ను, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. సోమవారం విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పది రోజుల క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, బీటెక్ చదివిన విద్యార్థులలో చాలా కాంపిటీషన్ ఉందని వాటిని అధిగమించి ఉద్యోగ అవకాశాలు సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్ లింగరాజు మాట్లాడుతూ ఈ శిక్షణ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందని, వర్సిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం డ్రీమ్ ప్యాంట్ ట్రైనింగ్ సొల్యూషన్స్ సీఈవో శ్రీధర్ జలపాటితో పాటు ఇంగ్లీషు ట్రైనర్ గోపీ, ఆప్టిట్యూడ్ ట్రైనర్ హరిశంకర్, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ ప్రోగ్రాం మేనేజర్ సాయి కిరణ్‌ను యూనివర్సిటీ యాజమాన్యం శాలువాతో సత్కరించి మెమెంటోను బహూకరించారు. వర్సిటీ అధికారులు శిక్షణ తీసుకున్న విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారని ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ తౌసిఫ్ అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ రామినేని శివరాం ప్రసాద్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, అతిథి అధ్యాపకులు కె.పృథ్వీరాజ్, సాంకేతిక నిపుణులు అజయ్, కోడూరు కనకరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ గంగాధరరావు

ఎంపీడీవోల డిప్యూటేషన్ రద్దు

నాదెండ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎంపీడీవోగా పనిచేస్తున్న స్వరూప రాణి, గతంలో పనిచేసిన శ్రీనివాసరావుల డిప్యూటేషన్‌లను రద్దుచేస్తూ జడ్పీ సీఈవో ఆదేశాలు జారీ చేశారు. దీంతో డిప్యూటేషన్‌పై ఇక్కడ పనిచేస్తున్న స్వరూపరాణి రెంటచింతలకు వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరావు సోమవారం ఎంపీడీవోగా విధుల్లో చేరారు. కొద్దిరోజుల క్రితం ఇద్దరికి ప్రభుత్వం ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించి బదిలీ చేసింది. కాగా ప్రమోషన్ పొంది గతంలో పనిచేసిన స్థానాల్లోనే డిప్యూటేషన్‌పై పనిచేస్తుండటంతో సాంకేతిక సమస్యలు తలెత్తటంతో డిప్యూటేషన్ రద్దయింది.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

మోడల్ పాఠశాల విద్యార్థికి తెలుగు ప్రతిభా పురస్కారం

రొంపిచర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పర్లరెడ్డిపాలెంలోని పీఎంశ్రీ ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయి తెలుగు ప్రతిభా పురస్కారం అవార్డు పొందినట్లు హెచ్‌ఎం రవినాయక్ సోమవారం తెలిపారు. మన సంస్కృతి సంస్థవారు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలో 9వ తరగతి విద్యార్థిని పొలిమేర హారిక రెండో స్థానం కైవసం చేసుకుందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 2500 మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారన్నారు. తెలుగు అధ్యాపకులు సోమేశ్వరరావు, ఏసుదయ, హేమలత ఇచ్చిన శిక్షణ విద్యార్థికి ఎంతో దోహదపడిందన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్ గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వినుకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని విఠంరాజుపల్లి గ్రామం వద్ద సోమవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే... ప్రకాశం జిల్లా దర్శి మండలం గంగవరం గ్రామానికి చెందిన అజయ్, నారాయణలు సొంత పనులపై ద్విచక్రవాహనంపై నరసరావుపేట వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా విఠంరాజుపల్లి గ్రామ సమీపంలో కారును బలంగా ఢీకొట్టారు. ఈ తరుణంలో విఠంరాజుపల్లికి చెందిన సుబ్బులు అనే మహిళతో పాటు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. 108లో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇద్దరి బైండోవర్

ఈపూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రముట్ల, మంగళూరు గ్రామాలకు చెందిన ఇరువురు వ్యక్తులను అక్రమ మద్యం కేసులో సోమవారం ఈపూరు తహసీల్దార్ నళిని వద్ద హాజరుపరిచారు. ఇద్దరిని బైండోవర్ చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

గురుకుల పాఠశాలలో విచారణ

నూజెండ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉప్పలపాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల విద్యాలయంలో అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆదివారం పాఠశాల వంటశాలలో కుక్కలు ఆహార పదార్థాలను పాడుచేసిన సంఘటనపై విచారణ చేశారు. ఈ సందర్భంగా డీసీవో శ్రీదేవి మాట్లాడుతూ పాఠశాలలో బోధన, బోధనేతర సిబ్బంది బాధ్యతగా ఉండాలన్నారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత ముఖ్యమన్నారు. ప్రహరీ పడిపోయిన చోట్ల పునర్నిర్మించాలని, వంట గదుల్లోకి కుక్కలు, కోతులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

● జిల్లా రెవెన్యూ అధికారి మురళి

నరసరావుపేట టౌన్. డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ అర్జీలను నాణ్యతగా పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి మురళి అన్నారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుంచి జిల్లా రెవెన్యూ అధికారి, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా 112 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మురళి మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై ఆర్డీవోలు, జిల్లా అధికారులు ప్రతివారం తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆర్డీవోలు, జిల్లా అధికారులు ఒకటి, రెండు అర్జీలను స్వయంగా తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో మురళి, అధికారులు

ఎస్పీ పీజీఆర్ఎస్‌కు 94ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ బీ కృష్ణారావు ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ అంశాలకు సంబంధించి మొత్తం94 ఫిర్యాదులు అందాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నాదెండ్ల మండలం తూబాడు గ్రామానికి చెందిన భార్యాభర్తలు రూ50 లక్షలు దశల వారీగా తీసుకొని మోసం చేశారని రొంపిచర్ల మండలం గోగులపాడుకు చెందిన వారు ఫిర్యాదు చేశారు. వినుకొండ మండలం కొప్పికొండకు చెందిన 76సంవత్సరాల ఫిర్యాదికి తన మనమరాలు బాగోగులు చూసుకుంటానని ఎనిమిది సవర్ల బంగారం, కొంత నగదు తీసుకొని ప్రస్తుతం పట్టించుకోవటం లేదని ఫిర్యాదు చేశారు. నరసరావుపేటలోని రామిరెడ్డిపేటకు చెందిన మహిళకు మిలటరీలో పనిచేసే ప్రకాశం జిల్లా దర్శి మండలం శివరాజు నగర్‌కు చెందిన వ్యక్తికి వివాహమైందన్నారు. తదుపరి ఆ మహిళ భర్త చనిపోయాడని తన భర్తకు సంబంధించి డెత్ బెనిఫిట్‌లో, ఆస్తిలో తనకు వాటా ఇవ్వకుండా తన అత్తమామలు ఇబ్బంది పెడుతున్నారని తగు న్యాయం చేయాలని మహిళ కోరింది.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణారావు

మున్సిపల్ కార్మికుల సేవలు మరువలేనివి: జీవీ

వినుకొండ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని జాషువా కళాప్రాంగణంలో శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం జీవీ చేతుల మీదుగా మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జీవీ మాట్లాడుతూ కార్మికులు మెరుగైన సేవల వలన స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో వినుకొండ మున్సిపాలిటీ అవార్డు సాధించడం అభినందనీయమన్నారు. కారంపూడి రోడ్డులోని డ్రెయినేజి నిర్మాణంతో పాటు, నరసరావుపేట రోడ్డు, మార్కాపురం రోడ్డులోని ప్రధాన డ్రెయినేజీలను నిర్మాణం చేపడుతున్నాని తెలిపారు. పట్టణ ప్రజలకు వాకింగ్ సౌకర్యం కోసం జూనియర్ కాలేజీ గౌండ్‌లో వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో ఎప్పుడైనా ప్రజల సమస్యలు పరిష్కరించిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు బి.రోశయ్య, సౌదాగర్ జానీ, పెమ్మసాని నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, కమిషనర్ సుభాష్ చంద్రబోస్

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట లీగల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా సోమవారం పట్టణంలో వివిధ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పీఎన్‌సీ కళాశాలలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ప్రధాన కూడళ్ల నుంచి ఎయిడ్స్‌వ్యాధిపై అవగాహన కలిగిస్తూ కొనసాగింది. ర్యాలీలో పీఎన్‌సీ, ఎస్ఎస్ఎన్, కృష్ణవేణి తదితర కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఎన్‌సీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ ఎవరైనా ఎయిడ్స్ వ్యాధికి గురయినట్లయితే ఏఆర్టీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే మందులను తీసుకోవాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా హెచ్‌ఐవీ పరీక్ష చేస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవీలత, డాక్టర్ సురేష్, రెడ్ క్రాస్ ప్రతినిధులు వివిధ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు

● చిలకలూరిపేట: ఎయిడ్స్ డేని పురస్కరించుకొని ఏఎంజీ పాఠశాల విద్యార్థులు సోమవారం ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కుమ్మరి కాలనీ, ఎన్టీఆర్ కాలనీల మీదుగా ప్రదర్శన నిర్వహించారు. కుమ్మరి కాలనీలో మానవహారం నిర్వహించారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేట పట్టణంలో ఏఎంరెడ్డి ఫార్మసీ కాలేజీ విద్యార్థులు ఎయిడ్ డే సందర్భంగా సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పీ భార్గవ్‌భూషన్‌రావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ జట్టుకు 'ధనలక్ష్మి' విద్యార్థుల ఎంపిక

ఈపూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థినులు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాస్కెట్ బాల్ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు సోమవారం తెలిపారు. ఈ నెల 29వ తేదీన బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీలో జరిగే దక్షిణ మండల అంతర కళాశాల పోటీలలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తరపున ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన విద్యార్థులు తిరుపతమ్మ, నసీమా, మౌనిక, అమూల్యలు ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు, అధ్యాపకులు బలరాంనాయక్, అరవిందు, ప్రసాదు, దాసు అభినందించారు.



తిరుపతమ్మ, నసీమా, మౌనిక, అమూల్య

రెడ్డిపాలెంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

బొల్లాపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పునీత ఫ్రాన్సిస్ శౌరివారి ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను సోమవారం ఫాదర్ జాకబ్‌రెడ్డి ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన వారికి శ్రీచక్రా సిమెంట్ సారథ్యంలో రూ.20,116లు, ద్వితీయ బహుమతి రూ.15,116లు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్, తృతీయ బహుమతి రూ.12,116లు అవుకు శివప్రసాదు బయోవిజన్ ఫార్మా కంపెనీ, 4వ బహుమతి రూ.7,116లు రెడ్డిపాలెం ఎంప్లాయీస్ అసోసియేషన్ వారి సహకారంతో అందించటం జరుగుతుందన్నారు.



రెడ్డిపాలెంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం



క్రీడాకారులతో గోనుగుంట్ల కోటేశ్వరరావు

రొంపిచర్లలో జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు శిక్షణ

రొంపిచర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సీనియర్ బాలికల విభాగంలో ఆడే జట్టుకు శిక్షణ కార్యక్రమాన్ని మండల కేంద్రమైన రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో సోమవారం ప్రారంభించారు. ఈ నెల 11వ తేదీ వరకు ఈ క్యాంపును నిర్వహించనున్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పశ్చిమ బెంగాల్‌లోని కలకత్తాలో జరిగే జాతీయస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారు. ఎంపికైన క్రీడాకారులను రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పులుకూరి జగ్గయ్య, పడాల చక్రారెడ్డి, హెచ్‌ఎం సుభానీ పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సైదయ్య పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ



వడ్డెంగుంటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మక్కెన, చిలకలూరిపేటలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి, నరసరావుపేటలో డాక్టర్ అరవిందబాబు తదితరులు

బొల్లాపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డెంగుంటలో సోమవారం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సంక్షేమ పథకాలు అందించటంతో రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే నెంబరు - 1 స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఎంపీడీవో పీ మాధురి, తహసీల్దార్ ఏ సుధాకర్, రూరల్ సీఐ బ్రహ్మయ్య, ఎస్ఐ సయ్యద్ సమీర్ బాషా, పంచాయతీ రాజ్ ఏఈలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజవర్గంలో సోమవారం 37 వేల మందికి రూ.16 కోట్ల మేరకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ జరిగింది. పట్టణంలోని 30, 31 వార్డులు, చిలకలూరిపేట మండలం రాజాపేట, నాదెండ్ల మండలం మల్లాయపాలెం, యడ్లపాడు మండలం కారుచోల గ్రామాలలో స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పర్యటించి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట టౌన్, డిశంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరవ కట్ట ప్రాంతంలో అరాచక శక్తులను ఉక్కుపాదంతో అణచివేశామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం నరసరావుపేట పట్టణం వరవకట్టలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హత్యా రాజకీయాలను ప్రోత్సహించారన్నారు. ముస్లిం నాయకుడు ఇబ్రహీంను శ్రీనివాసరెడ్డి హత్య చేయించారని విమర్శించారు. కార్యక్రమంలో పెన్షన్ లబ్ధిదారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

● నరసరావుపేట లీగల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.చంద్రశేఖర్, కార్యదర్శిగా ఎం.శ్రీను, మిగతా కార్యవర్గాన్ని మొత్తాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

● ఈపూరు: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఈపూరు ఎస్ఐ కె వేణుగోపాల్ సోమవారం తెలిపారు. ఐదుగురిని కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రూ.51వేల ఐదు వందలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

● వినుకొండ: పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో వివిధ మాలలు ధరించిన స్వాములకు మరో 20రోజులు సద్ది కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కనపర్తి వెంకట్రావు, ఆలయ అర్చకులు వేదాంతం లక్ష్మీనరసింహచార్యులు తెలిపారు. ధర్మకర్త కనపర్తి వెంకట్రావు పూర్తి సహకారంతో సద్ది వితరణ చేసినట్లు తెలిపారు.

● నూజెండ్ల: మండలంలోని తలార్లపల్లిలో జరుగుతున్న రీ సర్వే పనులను తహసీల్దార్ రమేష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో సర్వేయర్ చండీ రాణి, విలేజ్ గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

● నూజెండ్ల: దిత్వా తుఫాన్ ప్రభావంతో భారీ గాలులు, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి, మొక్కజొన్న రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సోమవారం మండల కేంద్రం నూజెండ్ల వరి పొలాలను వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్ పరిశీలించి పలు సూచనలు చేశారు.

● నరసరావుపేట టౌన్: దేశ రక్షణకోసం ప్రాణాలు త్యాగంచేసిన సైనికుల కుటుంబాల సహాయార్థం సాయుధ దళాల పతాక దినోత్సవం నిధికి నిరాళాలు ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి మురళి కోరారు. సోమవారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సాయుధ దళాల ఫ్లాగ్‌డే స్టిక్కర్స్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, సూపరింటెండెంట్ ఆనందరావు, వెంకటరాజేష్, సైనిక సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● వేల్పూరు (శావల్యాపురం): నర్సరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో జరిగిన బాలోత్సవంలో వేల్పూరు జడ్పీపాఠశాలకు చెందిన విద్యార్థులు 7 విభాగాల్లో అత్యున్నత ప్రదర్శనలిచ్చి విలువైన బహుమతులను గెలుచుకొన్నట్లు హెచ్‌ఎం మహబూబ్ సుభానీ సోమవారం తెలిపారు.

● యడ్లపాడు: మండలంలోని కారుచోల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం మరమ్మతు పనులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి సోమవారం శంకు స్థాపనచేశారు. సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని గాంధీనగర్, వెల్లటూరు, వడ్డెంగుంట గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు సోమవారం ప్రారంభించారు. వడ్డెంగుంటలో రూ.36 లక్షల వ్యయంతో హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

● నరసరావుపేట టౌన్: ఏఎన్‌యూ మహిళల బాస్కెట్ బాల్ పోటీలలో వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు. నవంబరు 28, 29 తేదీలలో యూనివర్శిటీలో జరిగిన పోటీలో వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారన్నారు. డిసెంబరు 29న బెంగళూరు క్రిస్ట్ యూనివర్శిటీలో జరిగే పోటీలలో యూనివర్శిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు తెలిపారు.

● బొల్లాపల్లి: మండలంలోని మేళ్ళవాగులో గీతా జయంతి సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రచారం చేశారు. మండలంలోని మేళ్ళవాగు, పమిడిపాడులో ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక పిడుగురాళ్ళ, చిలకలూరిపేట కమిటీల ఆధ్వర్యంలో గ్రంథాల పరిచయ కార్యక్రమం నిర్వహించారు.

అభివృద్ధికి సహకరించకపోగా అధికారులపై విమర్శలా: ఎంపీడీవో

శావల్యాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని ముందుండి నడిపించాల్సిన సర్పంచ్ గ్రామాభివృద్ధికి సహకరించకపోగా తన సంతకాన్ని ఫోర్జరీ చేసి పంచాయతీ ఖాతాలో నగదు డ్రా చేశారంటూ అధికారులపై ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో పోట్లూరు సర్పంచ్ పోపూరి జ్యోతి తీరుపై ఆయన తీవ్రఅసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ సర్పంచ్‌గా తన విధులను సక్రమంగా నిర్వహించకుండా జ్యోతి అధికారులపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచ్ జ్యోతి హాజరవ్వడం లేదని, గత నాలుగు జనరల్‌బాడీ సమావేశాలకు గైర్హాజరయ్యారన్నారు. డిప్యూటీ ఎంపీడీవో వివేకానంద మాట్లాడుతూ 15వ ఆర్థికసంఘం నిధులు డ్రాచేయాలంటే గ్రామసర్పంచ్ ఆధార్‌కు లింకైన ఫోన్ నెంబర్‌కు ఓటీపీ వెళుతుందని, ఓటీపీ చెప్పకుండా ఇతరులు నగదు డ్రా చేసే అవకాశం లేదన్నారు.